

నేడు స్పీకర్ అయ్యన్నపాత్రుడు రాక



విశాఖపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు సోమవారం జిల్లాకు రానున్నారు. ఉదయం 9గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి విమానంలో బయలుదేరి పది గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి సర్క్యూట్‌హౌస్‌కు వస్తారు. మధ్యాహ్నం మూడుగంటల వరకు నగరంలోనే ఉంటారు. ఆ తరువాత రోడ్డు మార్గంలో నర్సీపట్నం వెళతారని అధికారులు తెలిపారు.

జీవీఎంసీలో టీడీఆర్ హడల్

వైసీపీ హయాంలో అడ్డగోలుగా జారీ

- కుంభకోణంపై పూర్తిస్థాయి విచారణకు ప్రభుత్వ ఆదేశం
- బాధ్యులైన అధికారులు, ప్రజాప్రతినిధుల్లో గుబులు
- అప్పటి ప్రభుత్వ పెద్దల ఒత్తిడితోనే చేశామని ఆవేదన
- బలిపశువులుగా మారిపోతామని ఆందోళన



టీడీఆర్ ఇచ్చేందుకు నివేదికలు సిద్ధం చేసిన దసపల్లా భూములు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి): **మహావిశాఖ నగరపాలకసంస్థ (జీవీఎంసీ) అధికారుల్లో ట్రాన్స్‌ఫర్‌బుల్ డెవలప్‌మెంట్ రైట్ (టీడీఆర్) అంశం గుబులు రేపుతోంది. గత ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా రూ.వేల కోట్ల విలువైన టీడీఆర్‌లను జారీచేశారు. వైసీపీ నేతలు, అప్పటి ప్రజాప్రతినిధుల అడుగులకు మడుగులొత్తేలా జీవీఎంసీ అధికారులు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ కుంభకోణంపై కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఈ అంశంలో లోతైన విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని శాసనసభలో మునిసిపల్ శాఖా మంత్రి నారాయణ ప్రకటించారు. దీంతో ఈ వ్యవహారంతో సంబంధమున్న అధికారులతోపాటు అప్పటి ప్రజాప్రతినిధుల్లో అలజడి మొదలయింది.**

గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నేతలు టీడీఆర్‌పేరుతో భారీగా అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. దీనిపై ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తంచేయడంతోపాటు జీవీఎంసీ, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ వారెవరూ స్పందించలేదు. వైసీపీ నేతలను ప్రసన్నం చేసుకోవడం కోసం జీవీఎంసీ అధికారులు, కమిషనర్లు నిబంధనలను పక్కనపెట్టి టీడీఆర్‌లను జారీచేశారు.

కోర్టు కేసులుండగానే...

సిరిపురం జంక్షన్‌లోని సీబీసీఎన్‌సీ భూములపై హైకోర్టులో వివాదం నడుస్తోంది. ఈ భూమిని వైసీపీకి చెందిన మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ సొంతం చేసుకుని నిర్మాణాలు ప్రారంభించారు. ఆశీల్‌మెట్ట జంక్షన్ నుంచి సిరిపురం జంక్షన్ వరకూ రోడ్డుని 2041 మాస్టర్‌ప్లాన్ ప్రకారం విస్తరించాల్సి ఉందని పేర్కొంటూ సీబీసీఎన్‌సీ భూమిలోని కొంతస్థలాన్ని రోడ్డుకోసం తీసుకుంటున్నామని ప్రతిపాదించి రూ.63 కోట్ల విలువైన టీడీఆర్ బాండ్‌ను ఎంవీవీ సత్యనారాయణకు జీవీఎంసీ అధికారులు ఇచ్చేశారు. అసలు ఆ భూమి పై యాజమాన్య హక్కుకు సంబంధించిన వివాదం కోర్టులో ఉండగా టీడీఆర్ జారీచేయడం చర్చనీయాంశంగా మారింది. పైగా 20 ఏళ్ల తర్వాత రోడ్డు విస్తరణ చేస్తే ఆరోడ్డు మొత్తానికి ఆర్డీపీ చేసి, విస్తరణకు స్థలసేకరణ చేయకుండా కేవలం సీబీసీఎన్‌సీ భూమిలోనే రోడ్డు విస్తరణ చేస్తామని జీవీఎంసీ అధికారులు పేర్కొనడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

ఐక్కన్నపాలెం మాస్టర్‌ప్లాన్ రోడ్డును పదేళ్ల కిందట విస్తరించారు. ఇందులో తన భూమి పోయింది కాబట్టి టీడీఆర్ ఇవ్వాలంటూ చనిపోయిన స్థల యజమాని పేరు కలిగిన మరో వ్యక్తి జీవీఎంసీకి దరఖాస్తు చేస్తే అధికారులు అభ్యంతరం వ్యక్తంచేయకుండానే రూ.208 కోట్ల విలువైన టీడీఆర్‌ను జారీ చేసేశారు. ఈ టీడీఆర్‌ను అదే రోజు రాయలసీమకు చెందిన వ్యక్తిపేరిట బదిలీచేస్తూ రిజిస్ట్రేషన్ చేయడంతో దీనివెనుక పెద్దస్థాయిలో అవినీతి జరిగిందని తేలింది. పదేళ్ల కిందట తీసుకున్న భూమికి ఇప్పుడు టీడీఆర్ కోసం ఎందుకు దరఖాస్తు చేశారు. ఆ వ్యక్తికి సంబంధించిన పూర్తి వివరాలు, భూమికి సంబంధించిన పత్రాల పరిశీలన, సర్వే వంటి ప్రక్రియలను అధికారులు పట్టించుకోలేదు. ఇంకా వెలుగులోకి రాని మరిన్ని టీడీఆర్‌లు జారీ అయ్యాయని జీవీఎంసీ సిబ్బంది చెబుతున్నా, వివరాలు చెప్పడానికి భయపడుతున్నారు.

పెదజాలారిపేటపై కన్ను

దశాబ్దాలుగా జనావాసాలతో నిండిన పెదజాలారిపేట గ్రామం ఉన్న 21 ఎకరాల భూమి తమదంటూ రాణి సాహిబా వాద్వాన్ వారసులపేరుతో కొందరు టీడీఆర్ కోసం జీవీఎంసీకి దరఖాస్తు చేశారు. ఇందులో వస్తవాలు తెలుసుకోకుండా ఆగమేఘాలపై గ్రామాన్ని సర్వే చేయించారు. ఆ గ్రామం ఉన్న భూమికి రూ.2,800 కోట్ల విలువచేసే టీడీఆర్ బాండ్‌లు జారీచేసేందుకు అధికారులు సన్నద్ధమైపోయారు. దీనివెనుక అవినీతి వ్యవహారాన్ని 'పెదజాలారిపేట గ్రామం మాది' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' బట్టబయలుచేసింది. దీంతో జీవీఎంసీ అధికారులు టీడీఆర్‌జారీకి వెనుకాడారు. దీనివెనుక వైసీపీ పెద్దల అండతో యూఎల్‌సీ భూముల సెటిల్‌మెంట్ బ్రోకర్ చక్రం తిప్పారని సమాచారం.

దసపల్లా భూముల్లోనూ...

సర్క్యూట్‌హౌస్ ఉన్న దసపల్లా ... మిగతా 6వ పేజీలో

మ్యాట్రిమోనీ ఫ్రాడ్స్

నగరంలో పెరుగుతున్న బాధితులు

- వివాహ సంబంధ వెబ్‌సైట్లలో పేర్లు నమోదు చేసుకున్నవారే టార్గెట్
- ఆ డేటా ఆధారంగా మోసాలకు తెగబడుతున్న సైబర్ నేరగాళ్లు
- అందమైన యువతుల ఫొటోలతో ప్రొఫైల్స్
- ఫేక్ ఐడీలతో వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లో చాటింగ్
- వివిధ రకాలుగా లోబరచుకుని డబ్బు గుంజుతున్న వైనం
- బాధితుల్లో ఇంజనీర్లు, వైద్యులు, ఇతర ఉద్యోగులు
- నగరంలో వరుస కేసులతో అప్రమత్తమైన పోలీసులు



(ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం)

నగరంలో ఇటీవల మ్యాట్రిమోనీ ఫ్రాడ్స్ పెరుగుతున్నాయి. పెళ్లి సంబంధం కోసం వివిధ వెబ్‌సైట్లలో పేర్లు నమోదుచేసుకున్న వారి వివరాలను సేకరిస్తున్న సైబర్‌నేరగాళ్లు మోసాలకు తెగబడుతున్నారు. మంచి ఉద్యోగం చేస్తూ 30 ఏళ్లు దాటినా పెళ్లికాని వారిని, రెండో పెళ్లి సంబంధం కోసం పేరు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిని టార్గెట్ చేస్తున్నారు. ముగ్గురు నలుగురు ముఠాగా ఏర్పడి, యువతులతో ఫోన్ చేసి మాట్లాడిస్తున్నారు. వెబ్‌సైట్‌లో వివరాలను చూశామని, పెళ్లికి ఆసక్తిని కనబరుస్తున్నారు. ఫోన్‌నంబర్‌కు అందమైన యువతి ఫొటోను డీపీగా పెట్టి ఆకర్షిస్తున్నారు. ఆ తర్వాత వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లో చాటింగ్‌లు, ఫొటోలు, వీడియోలను పంపించి నియంత్రణలోకి తెచ్చుకుంటున్నారు. పుట్టినరోజు, ఇతర అవసరాల పేరుతో డబ్బు గుంజుతున్నారు. ఒకసారి కలుద్దామంటూ ప్రతిపాదించి, అత్యవసర పనిపడిందని, కుటుంబసభ్యులు ప్రమాదానికి గురయ్యారని సాకులు చెబుతున్నారు. అనుమానం రాకుండా వారిని ఉద్రేకపరిచేలా ఫొటోలు, వీడియోలు పంపించి అందిన కాడికి దోచుకుంటున్నారు.

నగరంలోని ఓ మెకానికల్ ఇంజనీర్ కొద్దిరోజుల కిందట మ్యాట్రిమోనీ వెబ్‌సైట్‌లో తన వివరాలను రిజిస్టర్ చేశారు. కొద్దిరోజులకే అతనికి ఫోన్ వచ్చింది. తాను కూడా ఇంజనీరింగ్ పూర్తిచేసి ఉద్యోగాన్వేషణలో ఉన్నానని, మంచి సంబంధం కోసం అదే వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకున్నానని చెప్పింది. దీంతో బాధితుడు తన కుటుంబ వివరాలు, ఆర్థిక స్థితిగతులను వివరించాడు. అనంతరం ఇద్దరూ వాట్సాప్, ఇన్‌స్టాలో చాటింగ్ మొదలుపెట్టారు. కొద్దిరోజులకు తన పుట్టినరోజుని, బంగారు ఆభరణాల కొనుగోలు చేయాలని డబ్బులు అడిగింది. ఆ తర్వాత కూడా పలు కారణాలను చూపించి సుమారు రూ.26 లక్షలు వరకూ గుంజేసింది. ఇంకా డిమాండ్ చేస్తుండడంతో స్నేహితుల సూచనమేరకు సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. పోలీసులు దర్యాప్తు చేసి యువతి పేరుతో మోసం చేస్తున్న కొమ్మిగాని లోకేష్‌ను ఈనెల 24న హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. అతడికి సహకరించిన ఆర్.సాయిధీరజ్‌తోపాటు ... మిగతా 6వ పేజీలో

మూడోసారి!

- హుద్‌హుద్ ఇళ్ల పూర్తికి టెండరు ఆహ్వానం
- అధికారుల నిర్వాకంతో ఇప్పటికీ పూర్తికాని పనులు



కొమ్మాదిలో హుద్‌హుద్ ఇళ్లు

విశాఖపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కొమ్మాది, పరదేశిపాలెంలోని హుద్‌హుద్ ఇళ్ల పెండింగ్ పనులు పూర్తిచేసేందుకు వీలుగా గృహనిర్మాణ సంస్థ మూడోసారి టెండర్లు ఆహ్వానించింది. ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసినప్పటికీ ఇంకా ప్లాస్టింగ్స్, ఫ్లోరింగ్, తలుపులు, కిటికీలు అమర్చడానికి రూ.ఆరు కోట్లకు తాజాగా టెండర్లు పిలిచింది. గత ప్రభుత్వంలో బిల్లులు మంజూరుకావడం లేదని వెనకడుగు వేసిన కాంట్రాక్టర్లు 2016-17 ధరల మేరకు పనులు చేపట్టేందుకు ముందుకు రావడంలేదు. ఇప్పటికే రెండు సార్లు టెండర్లు పిలిచినా స్పందన లేకపోవడంతో తాజాగా రెండు రోజుల క్రితం మూడోసారి టెండర్ పిలిచారు.

సుమారు ఎనిమిదేళ్ల క్రితం కొమ్మాది సర్వేనంబరు 83లో 608, పరదేశిపాలెం సర్వేనంబరు 21లో 192 ఇళ్ల పనులు ప్రారంభించారు. నగర శివారుల్లో మినహా మిగిలిన ప్రాంతాల్లో పనులు వేగంగా పూర్తైనా ఈ రెండు కాలనీల్లో మాత్రం అధికారుల నిర్వాకంతో ఇప్పటివరకు ఫినిషింగ్ పనులు పెండింగ్‌లో ఉండిపోయయి. పనులు ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు ముగ్గురు డీఈలు మారి, ప్రస్తుతం నాలుగో అధికారి పర్యవేక్షణ చేస్తున్నారు. గతంలో పనిచేసిన ఇద్దరు డీఈలు సంబంధిత కాంట్రాక్టర్ల నుంచి భారీగా డబ్బులు పిండేశారన్న ఆరోపణలున్నాయి. అయినా పనులు సకాలంలో పూర్తిచేయడం లో విఫలమయ్యారు. వారిద్దరూ జిల్లా కార్యాలయంలో అధికారుల చుట్టూ ... మిగతా 6వ పేజీలో

పీజీ ప్రవేశాలపై సందిగ్ధం..!

గత నెల 28న పీజీ సెట్ ఫలితాలు విడుదల చేసిన ఏయూ అధికారులు

- ఇప్పటికీ ప్రవేశాల షెడ్యూల్ విడుదల చేయని ఉన్నత విద్యాశాఖ
- అర్హత సాధించిన 13 వేల మందికిపైగా విద్యార్థుల నిరీక్షణ
- ప్రైవేటు కాలేజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిలిపేసిన వైసీపీ ప్రభుత్వం



విశాఖపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాలపై సందిగ్ధత కొనసాగుతోంది. పీజీ సెట్ ఫలితాలు విడుదలై నెల రోజులు కావస్తున్నా ఉన్నత విద్యాశాఖ ప్రవేశాల షెడ్యూల్ ప్రకటించలేదు. ఈ ఏడాది 34 కోర్సుల్లో పీజీ సెట్ నిర్వహించిన ఆంధ్ర విశ్వవిద్యాలయం గత నెల 27న ఫలితాలను విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 వేల మంది, ఏయూ పరిధిలో 13,108 మంది విద్యార్థులు అర్హత సాధించారు. వీరంతా కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎదురుచూస్తున్నారు. నెల రోజులు దాటినా షెడ్యూల్ విడుదల చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా పీజీ సెట్ ఫలితా లు విడుదలైన వారం రోజుల్లో ప్రవేశాల షెడ్యూల్ విడుదల చేస్తారని, కానీ, ఈ ఏడాది అధికారులు ఆ దిశగా దృష్టి సారించడం లేదంటున్నారు.

నాలుగేళ్లుగా తగ్గుతున్న ప్రవేశాలు

నాలుగేళ్లుగా పీజీ కోర్సుల్లో ప్రవేశాలు భారీగా తగ్గాయని, ఈ ఏడాది ఫలితాలు వేగంగా ఇవ్వడంతో ప్రవేశాల ప్రక్రియ వేగంగా ప్రారంభిస్తారని భావించామని ఓ పీజీ కాలేజీ ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఆలస్యమయ్యే కొద్దీ విద్యార్థులు ప్రత్యామ్నాయం చూసుకుంటారని తెలిపారు. ఇప్పటికే ప్రైవేటు యూనివర్సిటీల్లో చేరిపోతున్నారని నగర పరిధిలోని మరో పీజీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆవేదన వ్యక్తం చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆశలు..

ప్రైవేటు కాలేజీల్లో పీజీ చదివే విద్యార్థులకు వైసీపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పథకాలను ఎత్తేసింది. దీంతో ... మిగతా 6వ పేజీలో

స్టాండింగ్ కమిటీ ఎన్నికకు నేడు కూటమి అభ్యర్థుల నామినేషన్

- రేపు దాఖలు చేయనున్న వైసీపీ అభ్యర్థులు
- అభ్యర్థుల ఎంపికపై ఇరుపక్షాల్లో కొనసాగుతున్న కసరత్తు



విశాఖపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరపున పోటీచేసే అభ్యర్థులు సోమవారం నామినేషన్ దాఖలు చేయాలని నిర్ణయించారు. స్టాండింగ్ కమిటీలోని పది స్థానాలకు పోటీచేసేందుకు కూటమికి చెందిన కార్పొరేటర్లు పోటీపడుతున్నారు. దీంతో ఎవరికి అవకాశం కల్పించాలనేదానిపై నేతల మధ్య కసరత్తు కొనసాగుతోంది. శని, ఆదివారాల్లో రెండుసార్లు దీనికోసం కూటమి ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు భేటీ అయి చర్చలు జరిపినప్పటికీ కొలిక్కిరాలేదు. దీంతో నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేలు ఇద్దరు చొప్పున ఎంపిక చేసి తుదిజాబితా తయారుచేయాలని తీర్మానించారు. సోమవారం ఉదయానికి అభ్యర్థుల ఎంపికపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఖరారవగానే అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావుకు నామినేషన్లు అందజేస్తారు.

మరోవైపు వైసీపీ కార్పొరేటర్లు కూడా స్టాండింగ్ కమిటీ ఎన్నికలో పోటీచేయాలని నిర్ణయించారు. ఇప్పటికే వైసీపీ కార్పొరేటర్లు తోట పద్మావతి, బిపిన్ కుమార్‌జైన్, నక్కెళ్ల లక్ష్మి, పల్లా అప్పలకొండ, అక్కరమాని రోహిణి, రెయ్యి వెంకటరమణ, సాడి పద్మారెడ్డి, గుండపు నాగేశ్వరరావు, ముర్రువాణి, మహ్మద్ ఇమ్రాన్ పేర్లను ఎంపిక చేసి పార్టీ అధిష్టానానికి పంపించినట్టు తెలిసింది. అయితే అటు నుంచి ఇంకా స్పందన రాకపోవడంతో మంగళవారం నామినేషన్లు దాఖలు చేయాలని నిర్ణయించారు.

ఎమ్మెల్యేకి 50వ వార్డులో సమస్యలపై వినతి



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకి వినతిపత్రమిస్తున్న వరప్రసాద్

మాధవధార, జూలై 28; గ్రేటర్ 50వవార్డు మాధవధార లో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలపై ఆదివారం ఆ వార్డు అధ్యక్షుడు సనపల.వరప్రసాద్ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకి వినతి పత్రంఅందించారు. ప్రధానంగా వార్డులోని 22ఏలో ఉన్న నిషేధిత భూములను ఆ జాబితా నుంచి తొలగించాలని విన్నవించారు. మాదవధారలో రైతుబజార్ ఏర్పాటు, పార్కుల అభివృద్ధి అంశాల్ని పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వరప్రసాద్ తెలిపారు.

చిన్నారులకు క్రీడా పోటీలు

డాబాగార్డెన్స్, జూలై 28: బాల్య దశలో క్రీడల్లో పాల్గొంటే.. వారు ఎంతో ఆనందంగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందని పలువురు అతిథులు పేర్కొన్నారు. ఆదివారం జీవీఎంసీ చిల్డ్రన్స్ ఎరీనాలో పేజ్-3 ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో న్యూ ఇండియా ఒలింపిక్ జేబీ గేమ్స్ 2024 ఆటల పోటీలను నిర్వహించారు. ఐదు నెలల నుంచి 54 నెలల వయస్సు నిండిన చిన్నారులు బుడిబుడిఅడుగులతో ఆటల్లో పాల్గొన్నారు. రన్నింగ్, విలువిద్య, సైకిలింగ్, నడక తదితర అంశాల్లో పాల్గొని సత్తాచాటారు. ఈ సందర్భంగా అతిథులుగా హాజరైన ఎన్‌బీటీజీ వ్యవస్థాపకుడు దుర్గాప్రసాద్, వీఓ వ్యవస్థాపకులు శివ, ప్రీతమ్, సంస్కృతి పాఠశాల డైరెక్టర్స్, వాలంటీర్స్ పి.నిరుపమ, ధనలక్ష్మి హాజరై మాట్లాడుతూ బాల్య దశనుంచి చిన్నారులను క్రీడల్లో ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. విజేతలకు సర్టిఫికెట్స్, మెడల్స్ ప్రదానం చేశారు.

1న చంద్రబాబు పాలన పురోగతిపై సదస్సు

డాబాగార్డెన్స్, జూలై 28: చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై 50 రోజులు పూర్తవుతున్న సందర్భంగా తెలుగుశక్తి ఆధ్వర్యంలో ఆగస్టు 1న రాష్ట్ర పురోగతిపై సదస్సును నిర్వహించనున్నట్లు తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. ఆదివారం సదస్సుకు సంబంధించి పోస్టర్‌ను దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆవిష్కరించారన్నారు. సదస్సులోఅన్ని రంగాల ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.ఈకార్యక్రమంలోవసంతరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ మ్యూజిక్ అకాడమీ నూతన కార్యవర్గం ఎంపిక

డాబాగార్డెన్స్, జూలై 28: విశాఖ మ్యూజిక్ అకాడమీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో అకాడమీ 52వ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంగీత ప్రపంచానికిసేవలందించి పదవీ విరమణ చేస్తున్న విభాగ అధ్యక్షులు డాక్టర్ ఎస్వీ రంగరాజన్, కార్యదర్శిగా అనన్య. ఎం.ఎస్.శ్రీనివాస్ సేవలను అకాడమీ బృందం ఈసందర్భంగా కొనియాడారు. దక్షిణ భారతదేశ కళాకారులు, సంగీతప్రియులకు అకాడమీ ద్వారా వారు చేసిన సేవలనుప్రశంసించారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా కేవీ రామ్మూర్తి, కార్యదర్శిగా వీరఘంట చంద్రశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా బీఏ రాజారావు, డా.పేరాల బాలమురళీకృష్ణ, కోశాధికారిగా సీహెచ్ దుర్గాప్రసాద్, సహాయకార్యదర్శులుగా భుజంగరావు,జ్వాలాప్రసాద్ ఎన్నికయ్యారు.

ముగ్గురు విద్యార్థులను కాపాడిన లైఫ్‌గార్డులు

సాగర్‌నగర్, జూలై 28 : రుషికొండ తీరంలో సముద్ర స్నానాలు చేస్తూ ప్రమాదానికి గురైన ముగ్గురు ఇంజనీరింగ్ విద్యార్థులను లైఫ్‌గార్డులు రక్షించారు. ఆదివారం మల్కాపురం ప్రాంతానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులు ఈశ్వరరావు, భరత్, రవి రుషికొండ బీచ్‌కు విహారానికి వచ్చారు. వారు సముద్రంలో స్నానం చేస్తుండగా ఒక్క సారిగా పెద్ద కెరటం తాకడంతో చెల్లాచెదురయ్యారు. ప్రమాదాన్ని గమనించిన లైఫ్‌గార్డులు వారిని రక్షించి, సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ఈశ్వరరావు సముద్రం నీళ్లు తాగేయడంతో గీతం ఆసుపత్రికి తరలించారు. ఆరిలోవ ఎస్ఐ రామదాసు సంఘటనా స్థలానికి చేరుకుని, విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

కృషి, పట్టుదలతో విజయం తథ్యం

» పార్వతీపురం జిల్లా కలెక్టర్ ఆదారి శ్యాంప్రసాద్



బహుమతులు అందిస్తున్న అతిథులు

అక్కయ్యపాలెం, జూలై 28: విద్యార్థి దశ నుంచే నిరంతర కృషి, పట్టుదలతో ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగితే విజయం తప్పకుండా వరిస్తుందని పార్వతీపురం జిల్లా కలెక్టర్ ఆదారి శ్యాంప్రసాద్ అన్నారు. కేంద్ర గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోర్టు కళావాణి ఆడిటోరియంలో గవర సామాజిక వర్గంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం, అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తాను లక్ష్యం దిశగా కృషి చేసి ఉన్నతస్థాయికి ఎదిగానన్నారు. ఐఏఎస్ చదవాలనుకునే వారికి అవసరమైన పుస్తకాలు అందిస్తానని హామీ ఇచ్చారు. పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పి.గణబాబు మాట్లాడుతూ ప్రపంచంలోని శాసించే రంగాల్లో నిష్ణాతులైన వారు గవర జాతీయులు ఉండడం గర్వకారణమన్నారు.గౌరీ సేవా సంఘం చేస్తున్న అభినందనీయమన్నారు. అనంతరం ఉత్తమ విద్యార్థులకు నగదు బహుమతులు, షీల్డ్‌లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్య నిపుణుడు మళ్ళ భాస్కర్, సంఘం అధ్యక్షుడు బుద్ధ శివాజీ, జడ్పీ వైస్‌చైర్‌పర్సన్ భీశెట్టి సత్యవతి, బొడ్డేటి కాశీవిశ్వనాథం, మళ్ళ రామునాయుడు, ఆదారి లచ్చ అప్పారావు, మొల్లేటి వీర కుమారస్వామి, వేగి సత్యనారాయణపాల్గొన్నారు.

రావిశాస్త్రి రచనలు సమాజ దర్పణం

» జయంతి ఉత్సవంలో సాహితీవేత్తలు



రావి శాస్త్రికి చిటానికి నివాళులర్పిస్తున్న సాహితీ వేత్తలు

సీతంపేట, జూలై 28: రాచకొండ విశ్వనాథ శాస్త్రి (రావిశాస్త్రి) ప్రపంచ స్థాయికి తగిన రచయిత అని సాహితీ వేత్తలు కొనియాడారు. ఆయన అణగారినవర్గాల జీవితాలపై ఉత్తరాంధ్ర మాండలికంలో అద్భుతంగా రచనలు సాగించారన్నారు. ఆదివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో రచయిత కూనపరాజు కుమార్ అధ్యక్షతన రావిశాస్త్రి 102వ జయంతి సభను ఘనంగా నిర్వహించారు. రావిశాస్త్రి పేరిట పురస్కారాలను యువ రచయితలు మల్లిపురం జగదీష్, ఊహ, సురేంద్ర శీలంకు అందచేశారు. ముందుగా రావిశాస్త్రి చిత్రపటానికి వందన సమర్పణ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యవక్తగా విచ్చేసిన సీనియర్ న్యాయవాది వృద్ధుల కళ్యాణ రామారావు తాను రావిశాస్త్రి వద్ద జూనియర్‌గా పనిచేయటానికి వెళ్తే.. ఆయన తనను తాతా సూర్యనారాయణ వద్ద చేర్పించారన్నారు. తన వద్ద నేర్చుకోకూడని విషయాలు కూడాఉన్నాయని అందుకే సూర్యనారాయణ వద్ద చేర్పించినట్టు రావి శాస్త్రి తెలిపారన్నారు. ఆయన కథల్లో జరీ అంచు తెల్లచీర, మాయ గొప్ప విలువలతో కూడినవని వివరించారు. కోర్టు విషయాలపై అవగాహన ఉన్న వారికి శాస్త్రి కథలు బాగా అర్థమవుతాయన్నారు. ఆఖరి దశ, మోక్షం లాంటి గొప్ప కథలు సృష్టించిన మహా రచయిత అని పేర్కొన్నారు. సాహితీ వేత్త జీఎస్ చలం మాట్లాడుతూ రావిశాస్త్రి సాహిత్య సముద్రమని తెలిపారు. రావిశాస్త్రి కుమారుడు ఉమాకుమార శాస్త్రి మాట్లాడుతూ తన తండ్రి చివరి దశలో తాను చాలా హాయిగా ఉన్నానని, జీవితంలో ఎవరి కష్టాన్ని మూటగట్టుకుని పోవట్లేదని సంతృప్తి వ్యక్తంచేశారన్నారు. ఈ కార్యక్రమంలో రచయితలు, ప్రముఖ సాహితీ వేత్తలు వాడ్రేవు చినవీరభద్రుడు, కెఎస్ మల్లీశ్వరి, జగదీష్, తాడి ప్రకాష్, హైకోర్టు అడ్వకేట్ వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరమెట్ట భూసమస్యకు త్వరలో పరిష్కారం



పల్లా శ్రీనివాసరావుకు వినతి పత్రమిస్తున్న విల్లూరి దంపతులు

అల్లిపురం, జూలై 28: గ్రేటర్ 33వార్డు వెంకటేశ్వర మెట్ట దేవాలయ భూముల సమస్యను కూటమి ప్రభుత్వం త్వరలోనే పరిష్కరించనున్నట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపినట్లుఆ పార్టీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు విల్లూరి డాక్టర్ చక్రవర్తి చెప్పారు. ఆదివారం నగరంలోని పల్లా శ్రీనివాసరావును ఆయన నివాసంలో మర్యాదపూర్వంగా విల్లూరి దంపతులు కలిసి వినతి పత్రం అందజేశారు. భూ సమస్య ప్రభుత్వంతో ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడారని, త్వరలో చర్చించిన తరువాత పరిష్కారిస్తామని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో విల్లూరి తిరుమలదేవి పాల్గొన్నారు.

చిన్నోడికి ప్రేమతో పుస్తకావిష్కరణ

డాబాగార్డెన్స్, జూలై 28: తల్లిదండ్రులు ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకం చిన్నోడికి ప్రేమతోనని ద్రవిడ యూనివర్సిటీ మాజీ వీసీ కె.ఎస్.చలం అన్నారు. ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో విద్యావంతుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం చిన్నోడికి ప్రేమ పుస్తకం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యంలో ప్రతి బిడ్డకి ఇటువంటి అనుభవం అవసరమన్నారు. పుస్తక రచయిత డా.విజయలక్ష్మి దూరంగా ఉన్న తన బిడ్డకు తను రాసిన ఉత్తరాలన్నీ బహుమతిగా ఇచ్చిన అంశాలతో ఈ పుస్తకం ప్రచురించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ వ్యవస్థాపకురాలు డా.కె.రమాప్రభ అధ్యక్షత వహించగా ఎస్.ఎస్.ఆర్.జగన్నాథరావు, పి.మురళీకృష్ణ, ఈదర రవికిరణ్, సుధ, శ్రీనాథ్, డా.జోస్, శ్రీనివాస్, నళిని, ప్రకాశరావు, రవికిరణ్, చంద్రశేఖర్, సునీల్‌రెడ్డి, పద్మ, కన్నయ్య, పాల్గొన్నారు.

'అధిక ఫీజు వసూళ్లు చేస్తున్న ప్రైవేట్ ఆసుపత్రుల గుర్తింపు రద్దు చేయాలి'

అల్లిపురం, జూలై 28: జిల్లా వ్యాప్తంగా ప్రజలనుంచి అధిక మొత్తంలో ఫీజు వసూలు చేస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులు, మెడికల్ ల్యాబ్‌ల లైసెన్సులను రద్దు చేయాలని ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె. అచ్యుతరావు, వై. రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం అల్లిపురం నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో జరిగిన అఖిల భారత యువజన సమాఖ్య ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌లు నిర్ణిత ఫీజులు వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు అశోక్, నాగరాజు, ఈశ్వర్,సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

బుద్ధుని విగ్రహం ఏర్పాటుకు విరాళం

అక్కయ్యపాలెం, జూలై 28 : గ్రేటర్ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలో ని కేఎస్ఎం ఉన్నత పాఠశాల ఆవరణలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుద్ధుడి విగ్రహం ఏర్పాటుకు ఆదివారం టీడీపీ విశాఖ పార్లమెంటరీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అకిరెడ్డి జగదీష్ రూ.1.25 లక్షలు అం దించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు ప్రధాన కార్యదర్శి ముక్కి రామకృష్ణ, బీజేపీ అధ్య క్షుడు గురుగోవింద్ సింగ్, నాయకులు ఎంఎల్ఎన్ రావు, తోట శ్రీదేవి, శ్రీకృష్ణ, జనపాల కృష్ణ, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీమద్రామాయణ కల్పవృక్షంపై వ్యాససంపుటి ఆవిష్కరణ



వ్యాస సంపుటిని ఆవిష్కరిస్తున్న ప్రముఖ ప్రవచన కర్త గరికిపాటి నరసింహారావు

సీతంపేట, జూలై 28: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో శ్రీమద్రామాయణ కల్పవృక్షం ..ఉదాత్త కల్పనలు వ్యాస సంపుటి ఆవిష్కరణ సభను నిర్వహించారు. విశాఖ రసజ్ఞవేదిక వ్యవస్థాపకులు డాక్టర్ గండికోట రఘురామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రచయిత, ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచర కర్త గరికిపాటి నరసింహారావు, ఆజో-విభో, కందాళం ఫౌండేషన్ ఆచార్య అప్పాజ్యోస్యుల సత్యనారాయణలు వ్యాస సంపుటిని ఆవిష్కరించారు. తొలి ప్రతిని విశ్వనాథ సత్యనారాయణకు సమర్పించారు. వ్యాస కర్తలు ఆచార్య బేతవలు రామసుబ్రహ్మం, డాక్టర్ అద్దంకి శ్రీనివాస్, డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, బులులు వెంకటేశ్వర్లు, డాక్టర్ కడిమిళ్ళ వరప్రసాద్, డాక్టర్ పేరి రవికుమార్‌లు స్పందన తెలిపారు. తరుగా ప్రచురణాలయం ప్రతనిధి తురగు కృష్ణకుమార్ వందన సమర్పణ చేశారు.సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన మిత్రబింద, సాన్విరాజ్

విశాఖపట్నం (స్పోర్ట్స్), జూలై 28: కేంద్రీయ విద్యాలయాల జాతీయ బాలికల బ్యా డ్మింటన్ చాంపియన్‌షిప్ టోర్నీకి నగరానికి చెం దిన మిత్ర బింద, సాన్విరాజ్ ఎంపికయ్యారు. ఇక్క డ జరిగిన రాష్ట్ర స్థాయి కేంద్రీ య విద్యాలయాల బాలికల అండర్-14 విభాగంలో సాన్విరాజ్, అండర్-17 విభాగంలో మిత్ర బింద పతకాలు సాధించి జాతీయ టోర్నీకి అర్హత సాధించారు. రైల్వే స్పోర్ట్సు ఎన్‌క్లేవ్ లోని బ్యాడ్మింటన్ అకాడమీలో కోచ్ ఉదయ్ భాస్కర్ వద్ద శిక్షణ పొందుతున్న ఈ చిన్నారులను రైల్వే స్పోర్ట్సు ఆఫీసర్స్ ప్రవీణ్ భాటి, అవినాష్, ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాసరావు అభినందించారు. త్వరలో కేరళలో జరగనున్న జాతీయ టోర్నీలో కూడా పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

జీవో 117 రద్దు చేయాలి: డీటీఎఫ్

పూర్ణామార్కెట్, జూలై 28: పాఠశాల విద్యా వ్యవస్థకు అవరోధంగా మారిన జీవో 117ను తక్షణం రద్దుచేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) గౌరవ అధ్యక్షుడు జి.పైడపునాయుడు డిమాండ్ చేశారు. ఆది వారం క్వీన్‌మేరీ గర్ల్స్ హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం పాఠశాల రీ ఆర్గనైజేషన్ జీవో 84 తీసుకురావడంతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. 2022లో ఇచ్చిన జీవో 117తో 3,4,5, తరగతులను ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు తరలించడంతో అనేక పాఠశాలలుమూతపడే పరిస్థితి నెలకొందన్నారు. సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

31న కెమికల్ కళాశాలలో సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

కంచరపాలెం, జజూలై 28 : కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాలలో పాలిసెట్ కౌన్సెలింగ్‌లో మిగిలిన సీట్లకు ఈనెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ పేర్కొన్నారు. కళాశాల్లో 16 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. కెమికల్ ఇంజినీరింగ్ బ్రాంచిలో 6, ప్లాస్టిక్ &పాలిమర్స్‌లో 5, ఆయిల్ టెక్నాలజీలో 5 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

కేన్సర్ సేవలను మరింత విస్తృతపరచాలి: కలెక్టర్

విశాఖపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కేన్సర్ సేవలను ప్రతి రోగికి అందించేలా వైద్యులు కృషి చేయాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సూచించారు. ఆంధ్ర మెడికల్ కళాశాల ఆడి టోరియంలో రెండో రోజు జరిగిన నేషనల్ కేన్సర్ గ్రిడ్ ఏపీ చాప్టర్ రెండో వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడారు. కేన్సర్‌ను ముందు జాగ్రత్తతో అరికట్టేందుకు అవకాశం ఉందని, ప్రజల్లో ఈమేరకు అవగాహన కల్పించాలన్నారు. నేషనల్ కేన్సర్ గ్రిడ్ ఏర్పాటుతో కేన్సర్ చికిత్సలో అధునాతన చికిత్సలు, అందుబాటులో ఉన్న వైద్య విధానాలపై చర్చించడం శుభపరిణామమన్నారు. ఈ సమావేశాలు నిరంతరం కొనసాగాలన్నారు. కేజీహెచ్‌లో హోమీ బాబా కేన్సర్ ఆస్పత్రి సహకారంతో నిర్వహిస్తున్న సేవలకు అవసరమైన సహకారాన్ని అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్ర మంలో హోమీ బాబా కేన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ ఉమేశ్ మహంత్ శెట్టి, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు, కేన్సర్ విభాగాధిపతి డాక్టర్ శిల్ప పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రజా వ్యతిరేకం'



జగదాంబ వద్ద నిరసన వ్యక్తంచేస్తున్న నాయకులు, కార్యకర్తలు

జగదాంబ కూడలి, జూలై 28: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతు, కార్మిక, గ్రామీణ పేదలకు వ్యతిరేకంగా ఉందని సీఐ టీయూ నేతలు విమర్శించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం బడ్జెట్‌కు వ్యతిరేకంగా ప్రతులు దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ విశాఖ జిల్లా కార్యదర్శి ఆర్‌కెఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ, బడ్జెట్‌లో గ్రామీణ ప్రాంత పేద వర్గాలకు పూర్తి అన్యాయం జరిగిదదన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాల నిధుల్లో కోత విధించడం ఏమేరకు న్యాయమని ప్రశ్నించారు. ఇప్పటికే కేంద్రంపై ఇటీవల జరిగిన ఎన్నికల్లో పలు రాష్ట్రాల్లో ప్రజలు వ్యతిరేకత వ్యక్తమైన విషయం గుర్తుంచుకోవాలన్నారు. రైతు సంఘం జిల్లాకార్యదర్శి జి. నాయన బాబు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ రైతులకు ఎంత మాత్రం ఉపకరంగా లేదని విమర్శించారు. వ్యవసాయరంగాన్ని ఆదుకొనేలా బడ్జెట్‌లో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ శ్రేణులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వరరావు, రాజు, విశాఖ జిల్లా నాయకులు ఎ. సీతాలక్ష్మి, పి. మణి, పి.వెంకటరెడ్డి, ఒమ్మి అప్పారావు, చంద్రమౌళి, నరేంద్రకుమార్, దేముడునాయుడు, భారతి కొండమ్మ, శంకరరావు, బాబురావు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల సమస్యలపై దృష్టి



మాట్లాడుతున్న అకౌంట్స్ డైరెక్టర్ మోహనరావు

మహారాణిపేట, జూలై 28: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ పింఛదారుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తున్నట్టు రాష్ట్ర ట్రెజరరీ అకౌంట్స్ డైరెక్టర్ ఎం. మోహనరావు తెలిపారు. ఆది వారం ప్రభుత్వ పింఛన్‌దారుల సంఘం కార్యాలయంలో సమాచార శాఖ సిటిజన్స్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రభు త్వ పింఛన్ దారులు సర్వీస్ పింఛన్, కుటుంబ పింఛన్‌పై అవగా హన కలిగి ఉండాలన్నారు. సరైన రీతిలో ధ్రువ పత్రాలు ఉన్నట్లయితే, పింఛన్ వెంటనే మంజూరు చేస్తామన్నారు. అధికారులను నేరుగా సంప్రదించవచ్చని, ఎటువంటి వంటి మధ్యవర్తిత్వం ఉండదన్నారరు. ఈ కార్యక్రమంలో ఆర్ త్యాగ్‌రాజు, సమాచార శాఖ ఆర్‌జేడీ ఆర్ వి. మణిరామ్, పి. వెంకటఅప్పారావు, పి. గోవిందరావు, డి . సాయిబాబా, డి ఝాన్సీ, రత్నబాయి తదితరులు పాల్గొన్నారు.

హెపటైటిస్‌పై అవగాహన అవసరం

మహారాణిపేట, జూలై 28: హెపటైటిస్ ఏ ప్రమాదకరమైన కాలేయ సంక్రమణ వ్యాధి అని, దీనిపై ప్రభుత్వం ప్రజల్లో అవగాహన పెంపొందించాలని ప్రముఖ పిల్లల వైద్యులు, వ్యాక్సిన్ నిపుణులు డాక్టర్ సీహెచ్ ఫణికృష్ణ అన్నారు. బీచ్‌రోడ్డులో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కలుషిత ఆహారం, నీటి వినియోగంతో వ్యాధివస్తుందన్నారు. పలువురు పాల్గొన్నారు.

మురళీనగర్‌లో వైద్య శిబిరం

మురళీనగర్, జూలై 28 ; మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో ఆదివారం క్లబ్ అధ్యక్షుడు పల్లా.చంద్రమౌళి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విశ్వం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్య సిబ్బంది రోగులకు చికిత్సలు అందించారు. వైద్యులు ఎస్.సతీష్ సీజనల్ వ్యాధుల నివారణపై పలు సూచనలందించారు. క్లబ్ కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

కథలతో పిల్లల ఊహలకు దోహదం

సీతంపేట, జూలై 28: ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో గ్రంథాలయ సొసైటీ, భారతీయ విద్యాభవన్స్ పబ్లిక్ స్కూల్ సంయుక్తంగా వియావాకీ స్టోరీటెల్లింగ్ సెషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ వాసిస్ ఓవర్ ఆర్టిస్ట్, కథకురాలు సీతాశ్రీనివాస్ ఆకట్టుకునే రీతిలో చిన్నారులకు కథలు చెప్పి వివరించారు. పిల్లలు కథలతో కలల ప్రపంచంలోకి ప్రవేశిస్తారని ఆమె తెలిపారు.

ప్రతిభ గుర్తింపునకే ప్రోత్సాహకాలు

ది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ చలసాని



చెక్కులు అందజేస్తున్న చలసాని రాఘవేంద్రరావు

సీతమ్మధార, జూలై 28 : విద్యార్థులు సమాజంలో కీలక ప్రాత పోషించాలన్న ఆశయంతో ది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ ఏటా తమ సభ్యులు, బ్యాంకు ఉద్యోగుల పిల్లలకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తుందని బ్యాంక్ ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు అన్నారు. మద్దిలపాలెంలోని కాకతీయ ఫంక్షన్ హాలులో ఆదివారం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఈఏడాది 479 మంది విద్యార్థులకు రూ. 29.75 లక్షల విలువైన నగదు బహుమతులు ప్రకటించినట్టు తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఎంసెట్, ఐఐటీ, నీట్ తదితర పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బాలాజీ ఎడ్యుకేషన్స్ ఇనిస్టిట్యూట్ ఛైర్మన్ మండప రవికుమార్, ఛైర్మన్ రాఘవేంద్రరావు చేతుల మీదుగా నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్లు సీఈఓ వీవీ నరసింహమూర్తి, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ఎం.పి. భరత్ నేడు కార్యాలయంలో ఉండరు

ఎం.వి.పి.కాలనీ, జూలై 28: పార్లమెంటు సభ్యులు శ్రీభరత్ సోమవారం విశాఖలో అందుబాటులో ఉండరని ఆయన కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. కేంద్ర బడ్జెట్ సమావేశాల్లో పాల్గొనేందుకు ఢిల్లీలోనే వెళ్లినట్టు పేర్కొన్నారు. ఆయన జన్మదినం సందర్భంగా పార్టీ కార్యకర్తలు, అభిమానులు గమనించాలని పేర్కొంది.

దంతెవాడ వరకే కిరండోల్ రైలు

విశాఖపట్నం, జూలై 28: భద్రతా కారణాల దృష్ట్యా విశాఖ, కిరండోల్ మధ్య నడిచే ప్రత్యేక పాసింజర్ రైళ్ల గమ్యాలను కుదించినట్టు సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖ-కిరండోల్ రైలు ఈనెల 28 నుంచి 31 వరకు విశాఖ నుంచి దంతెవాడ వరకు, తిరుగు ప్రయాణంలో కిరండోల్ - విశాఖ రైలు ఈనెల 29 నుంచి ఆగస్టు ఒకటి వరకు దంతెవాడ నుంచి విశాఖకు నడుస్తుందన్నారు.

జీవీఎంసీలో టీడీఆర్ హడల్

... 5వ పేజీ తరువాయి

భూములు దశాబ్దాలుగా ప్రభుత్వానికి దఖలుపడినట్టు రెవెన్యూ రికార్డుల్లో ఉన్నాయి. వైసీపీ నేతలు వాటిపై కన్నేశారు. దసపల్లా రాణి కమలాదేవి వారసులకు హక్కులున్నాయని పేర్కొంటూ ఆ భూములను డెవలప్‌మెంట్‌పేరుతో చేజిక్కించుకున్నారు. ఆ భూమిలో నుంచి ప్రస్తుత 40 అడుగుల రోడ్డులోనే పెద్దగా వాహన రాకపోకలు లేనప్పటికీ, వంద అడుగులకు విస్తరించాలని జీవీఎంసీ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రోడ్డు నిర్మాణం కోసం ఆగమేఘాలపై టెండర్లు పిలిచారు. విస్తరణలో దసపల్లా భూముల్లో సేకరించాల్సి ఉందంటూ రూ.120 కోట్ల విలువైన టీడీఆర్ జారీకి అంచనాలు తయారుచేశారు. దసపల్లా భూమిలో బహుళ అంతస్తుల భవనాలు నిర్మించాలంటే వంద అడుగుల అప్రోచ్ రోడ్డు ఉండాలి. దీంతో జీవీఎంసీ నిధులతోనే విస్తరించడంతోపాటు విస్తరణకు భూమి ఇచ్చినందున టీడీఆర్ తీసుకుని, ఆ బాండ్లనే బిల్డింగ్ పర్మిషన్, డెవలప్‌మెంట్ ఫీజుల కింద జీవీఎంసీకి చెల్లించాలని వైసీపీ నేతలు ఎత్తులు వేశారు. దీనిపై టీడీపీ, జనసేన నేతలు పెద్దఎత్తున ఆందోళనకు దిగడంతోపాటు కోర్టుల్లో కేసులు వేయడంతో టీడీఆర్ జారీకి బ్రేక్‌పడింది. సీతమ్మధార బిలాల్ కాలనీలో మూడెకరాల భూమి ఆంధ్రా బ్యాంక్ హౌసింగ్ కో-ఆపరేటివ్ సొసైటీదని పేర్కొంటూ రూ.వెయ్యి కోట్ల టీడీఆర్‌కు వైసీపీ నేతలు స్కెచ్ వేశారు. వెంకటపతిరాజునగర్‌లో వంద కోట్ల టీడీఆర్ బాండ్లకు ప్రయత్నించినవిషయం 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో అధికారులు బాండ్లు నిలిపివేశారు. ఇవికాకుండా ఎంవీపీ సిటీ, ఎండాడ ప్రాంతాల్లో మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అక్రమంగా టీడీఆర్‌లు పొందారనే ఆరోపణలున్నాయి.

మంత్రి ఆదేశాలతో గుబులు

ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో వీటన్నింటినీ గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రస్తావించడంతో పురపాలకశాఖమంత్రి నారాయణ దీనిపై లోతైన విచారణకు ఆదేశించారు. అక్రమంగా టీడీఆర్ పొందినవారితోపాటు జారీచేసిన అందరు అధికారులపైనా చర్యలు తప్పవని స్పష్టంచేశారు. దీంతో సంబంధిత అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి. అప్పటి అధికారపార్టీ నేతల ఆదేశాల మేరకు పనిచేశామని, వాటిని తిరగతోడితే ఇబ్బందులు తప్పవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మ్యాట్రిమోనీ ఫ్రాడ్స్


... 5వ పేజీ తరువాయి

మైకేల్‌పాలినీ పరారీలో ఉండడంతో వారి కోసం గాలిస్తున్నారు. అలాగే ఎంవీపీ కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు కూడా ఇలాంటి అనుభవమే ఎదురైంది. హైదరాబాద్‌కు చెందిన బత్తిసాయిప్రియఅతన్ని మోసం చేసి రూ.22 లక్షలు కొట్టేసింది. సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదుచేయడంతో ఆమెను ఈనెల 26న అరెస్టు చేశారు.

నైజీరియా వాసుల చేతిలో...

నగరానికి చెందిన ఓ వైద్యురాలు తన భర్తతో విడిపోయారు. రెండో పెళ్లికి కోసం వెబ్‌సైట్‌లో తన ప్రొఫైల్ రిజిస్టర్ చేశారు. ఆమె నంబరుకు అమెరికా నుంచి అంటూ ఓ వ్యక్తి ఫోన్‌చేశాడు. తనకు భారతీయురాలిని పెళ్లి చేసుకోవాలనే కోరిక ఉందని, సంపన్న కుటుంబానికి చెందిన వాడినని నమ్మించాడు. ఇద్దరు యువతులతో సముద్రంలో బోటింగ్ చేస్తున్న వ్యక్తిని తన తండ్రిగా పేర్కొంటూ ఓ ఫొటో, స్టెప్ మదర్‌గా పేర్కొంటూ మరొకరి ఫొటోను వైద్యురాలి వాట్సాప్‌కు పంపించాడు. మంచి ఇంటీరియల్ డెకరేషన్‌తో వున్న గదిలోని సీలింగ్‌కి ఫొటో తీసి తన బెడ్‌రూమ్‌గా చూపించాడు. తన కుటుంబంలో వ్యక్తిగత స్వేచ్ఛ ఎక్కువని ఆమెను మరింతగా ఆకర్షించాడు. దీంతో ఆమె పెళ్లికి సిద్ధమయ్యారు. దీంతో రెండు రోజుల్లో ఇండియా వస్తున్నానంటూ విమానంటిక్కెట్లను ఆమెకు వాట్సాప్ చేశాడు. అమెరికన్ కరెన్సీతోపాటు విలువైన బహుమతులు తెస్తున్నానని నమ్మించాడు. అయితే రెండు రోజుల తర్వాత తనను ఎయిర్‌పోర్టులోఅధికారులు అడ్డగించారని, ఓ వ్యక్తితో కస్టమ్స్ అధికారిగా మాట్లాడించాడు. బహుమతులు తిరిగి అప్పగించాలంటే జరిమానా కట్టాలని చెప్పడంతో ఆమె సుమారు రూ.24.29 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశారు. తర్వాత ఇంకా కావాలని కోరడంతో మోసపోయినట్టు గుర్తించి సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేయగా నిందితులు ఢిల్లీలో ఉంటు న్నట్టు తేలింది. దీంతో అక్కడ నైజీరియాకు చెందిన ఒసాస్ (38), అతనికి సహకరించిన మిస్లేయిర్‌ఖాన్ (27)లను అరెస్టు చేశారు.

అవగాహన తప్పనిసరి



సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇటీవల మాట్రిమోనీ ఫ్రాడ్స్ పెరుగుతున్నాయి. బాధితులంతా విద్యావంతులు, ఉద్యోగాల్లో ఉన్నవారే. పెళ్లి సంబంధం అందులో నూ అమెరికా సంబంధం అనేసరికి మరో ఆలోచన లేకుండా ట్రాన్స్‌లోకి వెళ్లిపోతున్నారు. వారు చెప్పింది గుడ్డిగా నమ్మేస్తున్నారు. మాట్రిమోనీఫ్రాడ్స్, స్టాక్‌మార్కెట్ ఫ్రాడ్స్ టాస్క్‌గేమ్స్ పేరుతో ఎవరైనా ఫోన్‌చేసినా స్పందించకూడదు. అనుమా నం ఉంటే 9490617917 నంబరుకు సమాచారం ఇవ్వాలి. మోసానికి గురైనట్టు గుర్తిస్తే 1930 నంబరుకు ఫోన్‌చేయాలి. దీంతో డబ్బులు సైబర్ నేరగాళ్ల చేతిలో పడకుండా ఫ్రీజ్ చేయించే వీలుంటుంది.

\- కె.భవానీప్రసాద్, సైబర్‌క్రైమ్ సీఐ

మూడోసారి!

... 5వ పేజీ తరువాయి

ప్రదక్షిణలు చేయడంతోనే కాలం గడిపేశారనే విమర్శలున్నాయి. దీంతో ఎనిమిదేళ్లయినా పనులు పూర్తికాలేదని, అదే ఇప్పుడు సంస్థకు భారంగా మారిందని కొందరు అధికారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మూడోసారి టెండర్లు పిలవాల్సి వచ్చిందని, కాంట్రాక్టు ఖరారై పనులు పూర్తిచేసేందుకు ఏడాది సమయం పడుతుందని చెబుతున్నారు. ఒకవేళ కాంట్రాక్టరు ఖరారుకాకపోతే ప్రస్తుతం ఉన్న రేట్ల మేరకు ప్రతిపాదనలు రూపొందించిన తరువాత మళ్లీ టెండర్లు పిలవాల్సి ఉంటుంది. అందుకు మరికొంత సమయం పడుతుందని భావిస్తున్నారు.

పీజీ ప్రవేశాలపై సందిగ్ధం..!

... 5వ పేజీ తరువాయి

వేలాదిమంది నిరుపేద విద్యార్థులు పీజీ చదవలేని పరిస్థితి ఏర్పడింది. ప్రైవేటు కాలేజీలు, యూనివర్సిటీల్లో భారీగా ఫీజులు చెల్లించాల్సి రావడంతో ఎక్కువమంది పీజీ కోర్సులకు దూరమయ్యారు. దీనిపై గతంలోనే చాలామంది మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ప్రస్తుతం ఉన్నత విద్యాశాఖను ప్రక్షాళన చేస్తున్నమంత్రిలోకేశ్.. దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోననే ఆసక్తి నెలకొంది.



రాహుల్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

బ్యాడ్మింటన్ క్రీడాకారునికి ఎమ్మెల్యే గణబాబు అభినందనలు

గోపాలపట్నం, జూలై 28: చైనాలో జరగనున్న ఏషియన్ చాంపియన్‌షిప్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన గాజువాక ప్రాంతానికి చెందిన రాహుల్ పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబును గోపాలపట్నంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశాడు. ఈ సందర్భంగా అంతర్జాతీయ క్రీడలకు ఎంపికైన రాహుల్‌ను ఎమ్మెల్యే అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి విశాఖ నగరానికి మంచిపేరు తీసుకురావాలని గణబాబు ఆకాంక్షించారు.

గోపాలపట్నం తహసీల్దార్‌గా వెంకట రమేశ్ బాధ్యతలు స్వీకరణ



వెంకటరమేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

ఎన్.ఎ.డి.జంక్షన్, జూలై 28: గోపాలపట్నం తహసీల్దార్‌గా చావలి వెంకటరమేష్ ఆదివారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు డీటీ సువర్ణభాయితో పాటు ఇతర ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గోపాపట్నం రెవెన్యూ పరిధిలోని అన్ని సచివాలయాలను సందర్శించి ఉద్యోగుల పనితీరు, ఆయా కార్యాలయాల పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తానన్నారు. మండలం పరిధిలో ఎలాంటి సమస్యలున్నా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లకుండా ఇక్కడే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్వేయర్ జగదీశ్, ఆర్ఐ సురేశ్, జూనియర్ సహాయకులు రోహిత్‌కుమార్, వీఆర్వో సుబ్రహ్మణ్యం, సిబ్బంది వంశీ, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

'గొన్నా' కళాశాలకు నాక్ గుర్తింపు

అగనంపూడి, జూలై 28: జీవీఎంసీ 85వ వార్డు పరిధి గొన్నవానిపాలెంలో గల గొన్నా ఇంజనీరింగ్ కళాశాలకు నేషనల్ అసెస్‌మెంట్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (ఎన్ఏఏసీ) గుర్తింపు లభించినట్టు కళాశాల కార్యదర్శి జి.హేమచంద్‌నాయుడు, చైర్మన్ పూజిత హనీశా తెలిపారు. ఇటీవల నాక్ బృందం కళాశాలలో రెండు రోజులు పాటు పర్యటించిందన్నారు. విద్యార్థులకు కావాల్సిన అన్ని రకాల సౌకర్యాలు, సదుపాయాలు ఇక్కడ ఉన్నట్లు గుర్తించారన్నారు. తమ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్ రావడం పట్ల వారు ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధనతో పాటు మంచి నడవడికను అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

ఇసుక సీజ్, రూ.25 వేల జరిమానా

కూర్మన్నపాలెం, జూలై 28: జీవీఎంసీ 88వ వార్డు పరిధి మంగళపాలెంలో ఇసుక అక్రమ నిల్వలపై సెబ్ సీఐ వై.లక్ష్మునాయుడు, గాజువాక రెవెన్యూ అధికారులు ఆదివారం దాడులు చేశారు. ఇటీవల మంగళపాలెం, దువ్వాడ, వెదుళ్ల నరవలలో ఇసుకను పలువురు అక్రమంగా నిల్వ చేసి అధిక ధరకు విక్రయిస్తున్నట్టు ఫిర్యాదులు రావడంతో అధికారులు తనిఖీలు చేసి చర్యలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా సీఐ లక్ష్మునాయుడు మాట్లాడుతూ ఇసుకను అక్రమంగా నిల్వ చేసి విక్రయిస్తుండడం, నకిలీ బిల్లులు కలిగి ఉండడంతో 18 టన్నుల ఇసుకను సీజ్ చేసి డిపోకు తరలించామన్నారు. అలాగే ఒక లారీని స్వాధీనం చేసుకుని ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించామని పేర్కొన్నారు. ఇసుక నిల్వ చేసిన నిర్వాహకులకు రూ.25 వేల జరిమానా విధించామన్నారు. ఈ తనిఖీల్లో ఆర్ఐ మంగరాజు, వీఆర్వో స్వరూప్, ఎక్సైజ్ ఎస్ఐ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **రాయన్ :** జగదాంబ, సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)

● **పురుషోత్తముడు :** శ్రీకన్య, రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), తాతా (తగరపువలస)

● **ఆపరేషన్ రావణ్ :** రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)

● **కల్కి :** మెలోడి, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 30, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 36, పచ్చిమిర్చి 48, కాకరకాయలు 42, బీరకాయలు 40, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 38, క్యాబేజ్ 30, క్యారట్ 30, దొండకాయలు 30, బంగాళదుంపలు 37, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 150, మునక్కాడలు (కిలో) 72, బరబాటి 34, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 46, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 78, పొటల్స్ 38, కీరదోస 28, క్యాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 82, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

చికెన్ ధరలు

బ్రాయిలర్

రైతు ధర	85
ఫారం ధర	105
విత్ స్కిన్	180
స్కిన్‌లెస్	190

వాహనదారులు భద్రతా ప్రమాణాలను పాటించాలి

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న పల్లా శ్రీనివాసరావు, తదితరులు

అగనంపూడి, జూలై 28: వాహనదారులందరూ తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలను పాటించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సూచించారు. అగనంపూడి వద్ద ప్రమాదాల నివారణపై ఆదివారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య పెరిగిందన్నారు. దీనికి వాహన చోదకులు భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం కూడా ఒక కారణమన్నారు. రోడ్డు ప్రమాదాల కారణంగా యువతీ యువకులు అకాల మరణ చెందుతున్నారని, దీంతో తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నా రన్నారు. అందువల్ల ప్రతిఒక్కరూ వేగ నియంత్రణతో పాటు హెల్మెట్, సీటు బెల్ట్‌లను ధరించి వాహనాలను నడపాలన్నారు. ఏ మాత్రం నిర్లక్ష్యంగా వాహనాలను నడిపినా ప్రమాదాలు వాటిల్లుతాయన్నారు. ఫార్మాసిటీ బస్సులతో పాటు బొగ్గు లారీల కారణంగా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. అనంతరం ప్రమాదాలను నివారించాలని కోరుతూ దువ్వాడ సీఐ ఎర్రంనాయుడు, ట్రాఫిక్ సీఐ నాగరాజులకు వినతిప్రతాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పల్లా కార్తీక్, గవర సోమశేఖర్, డి.త్రినాథ్, బి.సత్యనారాయణ, ఎం.విజయ్, అప్పారావు, కనకభవానీ, జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థంగా పనిచేసే వారికి శాశ్వత గుర్తింపు

అక్కిరెడ్డిపాలెం: కార్మికుల సంక్షేమం కోసం నిస్వార్థంగా పనిచేసే నాయకులకు శాశ్వత గుర్తింపు లభిస్తుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. బెల్ హెచ్‌పీవీపీలో పదవీ విరమణ చేసిన జాతీయ కబడ్డీ క్రీడాకారుడు, గుర్తింపు యూనియన్ మాజీ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి బాబూరావును బెల్ ఇంటక్ ఆధ్వర్యంలో గాజువాకలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పల్లా శ్రీనివాసరావు.. బాబూరావును సన్మానించారు. కార్పొరేటర్లు ఉరుకూటి చందు, పల్లా శ్రీనివాస్, గందం శ్రీనివాస్, నాయకులు మంత్రి రాజశేఖర్, యు.అప్పారావు, జి.రమణ, జీటీపీ ప్రకాశ్, జాతీయ కబడ్డీ క్రీడాకారులు శ్రీనివాసరావు, కనకరాజు, వైవీ శ్రీనివాస్, గణపతి, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ భూ కుంభకోణంపై సిట్ నివేదిక బయటపెట్టండి

- దోషులు ఏ పార్టీ వారైనా చర్యలు తీసుకోవాలి
- భూ దోపిడీ, కబ్జాలపై ప్రజల్లో అపోహలు తొలగిపోతాయి
- మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి బొత్స

విశాఖపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): విశాఖలో భూ కుంభకోణాలు, భూ కబ్జాలపై నిత్యం ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నందున గతంలో నియమించిన సిట్ నివేదికను బయటపెట్టాలని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. లాసన్స్‌బేకాలనీలోని వైసీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విశాఖ జిల్లా పరిషత్‌కు శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో భూ కబ్జాలు, కుంభకోణాలపై అధికార, విపక్ష సభ్యులు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకున్నారన్నారు. మరికొందరు ప్రెస్‌మీట్‌లు పెట్టి భూ కబ్జాలు, దోపిడీలపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. దీనివల్ల రాజకీయపార్టీలపైనా, నాయకులపైన ప్రజల్లో భిన్నాభిప్రాయాలు ఏర్పడడంతోపాటు మరికొందరు నాయకులు తాము కూడా కబ్జా చేయాలనే ఆలోచన కలిగే ప్రమాదం ఉందన్నారు. ఇలాంటి వాటికి అడ్డుకట్టపడాలంటే టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో భూ కుంభకోణాలు, కబ్జాలపై 2017లో ఏర్పాటుచేసిన సిట్ నివేదికను బయటపెట్టాలని కోరారు. దీనివల్ల 2004 నుంచి భూ దోపిడీ, కబ్జాలకు పాల్పడిన దొంగలు ఎవరనేది బయటకు వస్తారన్నారు. ప్రజలకు కూడా ఎవరు ఎలాంటి వారనే దానిపై స్పష్టత వస్తుందన్నారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో తాను స్వయంగా సిట్ నివేదికను బయటపెట్టాలని రెండుసార్లు కోరినా, ప్రభుత్వంలోని పెద్దలు పట్టించుకోలేదన్నారు. ఈ ఏడాది మార్చిలో విశాఖ పోర్టుకు బ్రెజిల్ నుంచి రూ.25 లక్షల కోట్ల విలువైన మాదకద్రవ్యాలు నౌకలో దిగుమతి అయ్యాయనే ప్రచారం జరిగిందని, దీనిపై స్పష్టత కోసం ఉత్తరాంధ్ర ఎంపీలు పార్లమెంట్‌లో ప్రశ్న లేవనెత్తాలని సూచించారు. అసలు డ్రగ్స్ వచ్చాయా?లేదా? వస్తే ఎవరు దిగుమతి చేశారు? వాటి వెనుక ఉన్నది ఎవరు? ఎంతకాలంగా జరుగుతోంది? వంటి వివరాలన్నీ బయటకు వస్తాయన్నారు. అసలు డ్రగ్స్ దిగుమతి జరగకపోతే విశాఖ పోర్టు ప్రతిష్ఠకు మచ్చతొలగిపోవడంతోపాటు రాష్ట్రంపై దేశప్రజల్లో ఏర్పడిన దురాభిప్రాయం తొలగిపోతుందన్నారు.

రాష్ట్రంలో ప్రతిపక్షహోదా కోసం సీఎం జగన్ కోర్టుని ఆశ్రయించడంపై విలేకరుల ప్రశ్నకు ఆయన స్పందిస్తూ చట్టంలో ఇవ్వాలని ఉంటే వస్తుందని, ఇవ్వకూడదని ఉంటే రాదు అని అన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడి ఇంకా 45 రోజులే అయినందున ఎన్నికల హామీలను నిలబెట్టుకుంటారా? లేదా? అనేదానిపై ఇప్పుడే స్పందించడం సరికాదన్నారు. అమరావతికి కేంద్రం రూ.15 వేల కోట్లు సాయం అప్పుగానే ఇస్తోందన్నారు. ఉపాధ్యాయుల బదిలీలకు తాను డబ్బులు తీసుకున్నాననేది కేవలం ఆరోపణలు మాత్రమేనని కొట్టిపారేశారు. పొరపాటు జరిగితే బదిలీల ర్యాటిఫికేషన్ కోసం సీఎంకు ఎందుకు పంపిస్తానని బొత్స ప్రశ్నించారు. వాస్తవాలు ఉంటే విచారణ జరుగుతుందని, తాను వద్దంటే మాత్రం విచారణ ఆపుతారా? అని ఎదురు ప్రశ్నించారు.

కాలేయ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్



హెపటైటిస్ డే ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట, జూలై 28: కాలేయ సంబంధిత వ్యాధులపై ప్రజలకు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అన్నారు. ఆదివారం హెపటైటిస్ డే సందర్భంగా ఆంధ్ర మెడికల్ కాలేజీ, కేజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం బీచ్ రోడ్డులో కాళీమాత ఆలయం విక్టరీ ఎట్ సీ వరకు నిర్వహించిన హెపటైటిస్ పై అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ హెపటైటిస్ బి,సిలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే దీర్ఘకాలిక అనారోగ్య పరిస్థితులకు దారితీస్తాయని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా కొన్ని కోట్ల మంది కాలేయ సంబంధిత వ్యాధులతో మృతి చెందుతున్నారన్నారు. ప్రధానంగా పిల్లలకు పుట్టిన 24 గంటల్లో హైపటైటిస్ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. ఆరోగ్య కరమైన జీవన శైలిని పాటించాలన్నారు. సమావేశంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు,గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం సీనియర్ వైద్యులు పెదవీర్రాజు, డాక్టర్ ఎల్ఆర్ఎస్ గిరినాథ్, కేజీహెచ్ హెచ్ఆర్ మేనేజర్ జవహర్‌రావుతో పాటు వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కోసం ఉక్కు నిర్వాసితుల ఎదురుచూపులు

వయస్సు పైబడిన వారికి కాంట్రాక్టు పోస్టులు ఇవ్వాలి



ఉక్కుటౌన్‌షిప్, జూలై 28: ఉక్కు కర్మాగారం నిర్వాసితులకు ఉపాధి కల్పించేందుకు యాజమాన్యం ముందుకు రావాలని నిర్వాసితులు,నిర్వాసిత సంఘాల నాయకులు కోరుతున్నారు. స్టీల్‌ప్లాంట్ నిర్మాణం సమయంలో ఇళ్లు, భూములు కోల్పోయిన వారిని నాడు నిర్వాసితులుగా గుర్తించి ఆర్-కార్డులు జారీ చేశారు. వీరిలో కొంతమందికి ఇప్పటివరకు దఫదఫాలుగా ఉపాధి కల్పించారు. ఇంకా సుమారు ఎనిమిది వేల మంది నిర్వాసితులకు ఉపాధి లభించలేదు. స్టీల్ ప్లాంటులో ఉద్యోగానికి వయస్సు పైబడి అర్హత లేని వారికి కాంట్రాక్టు కార్మికుల పోస్టులనైనా ఇవ్వాలని, అర్హత ఉన్నవారికి ఉపాధి కల్పించాలని వారు కోరుతున్నారు. నిర్వాసితులకు ఉపాధి లేకపోవడంతో వారు దుర్భర జీవనాన్ని గడుపుతున్నారని, అందువల్ల వారికి ఉపాధి కల్పించేందుకు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ముందుకు రావాలని స్థానిక ప్రజాప్రతినిధులు, ఉక్కు కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. అదే విధంగా నిర్వాసిత కాలనీలను యాజమాన్యం దత్తత తీసుకని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

ప్రతి నిర్వాసితుడికి ఉపాధి కల్పించాలి

ఉక్కు నిర్వాసితులకు ఉపాధి కల్పించేందుకు యాజమాన్యం ముందుకు రావాలని నిర్వాసిత సంఘం నాయకులు డిమాండ్ చేస్తున్నారు. పరీక్షలతో సంబంధం లేకుండా నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని వారు పేర్కొంటున్నారు. ఉపాధి కోసం ఏళ్ల తరబడి ఎంతోమంది నిర్వాసితులు ఎదురుచూడడమే తప్పా వారికి జీవనోపాధి కల్పించకపోవడం దారుణమని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉక్కు యాజమాన్యం స్పందించి వారికి న్యాయం చేయాలని కోరుతున్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర పురోభివృద్ధి సాధ్యం

ఫార్మా ఉద్యోగుల సంఘం ప్రతినిధి పొన్నగంటి మురళీమోహన్



మొక్కలు పంపిణీ చేస్తున్న ఫార్మా ఉద్యోగులు

కూర్మన్నపాలెం, జూలై 28: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర పురోభివృద్ధి సాధ్యమని ఫార్మా ఉద్యోగుల సంఘం ప్రతినిధి పొన్నగంటి మురళీమోహన్ అన్నారు. 86వ వార్డు పరిధి వుడా నగర్‌లో ఆదివారం సినీ నటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ కుమార్తె, ఎంపీ శ్రీభరత్ సతీమణి తేజశ్విని జన్మదినాన్ని పురస్కరించుకుని మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ కాలుష్య నివారణకు విధిగా కాలనీలో ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. శ్రీభరత్ హయాంలో విశాఖ నగరం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫార్మా ఉద్యోగులు నల్ల రామారావు, బొబ్బ శ్రీనివాస్,వినోద్, శేషు చౌదరి, భార్గవ్, వెంకటతేజ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ నూతన కార్యవర్గం

అక్కిరెడ్డిపాలెం, జూలై 28: విశాఖ జిల్లా ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం తుంగ్లాం కాలనీలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా ఎ.వనజాక్షి, అధ్యక్షునిగా ఈతలపాక మంగరాజు, ఉపాధ్యక్షులుగా కె.అప్పారావు, కె.రాము, ప్రధాన కార్యదర్శిగా కె.జాన్, సహాయ కార్యదర్శిగా త్రివేణి, ఎం.రమేశ్‌బాబు, కోశాధికారిగా టి.వసంత్ ఎన్నికయ్యారు.

కేంద్రీయ విద్యాలయంలో మొక్కలు నాటిన విద్యార్థులు

మల్కాపురం, జూలై 28: కేంద్రీయ విద్యాలయం నౌసేనాబాగ్-1లో ఆదివారం ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విద్యాలయం ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్ మాంగి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ కనీసం ఒక మొక్క నాటాలని కోరారు. మొక్కలను నాటడం వల్ల కాలుష్యాన్ని కొంతవరకైనా నివారించవచ్చని పేర్కొన్నారు. అందువలన ప్రజలందరూ మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో జీవశాస్త్ర ఉపాధ్యాయులు సీహెచ్ఎంఎస్ కుమార్, గురుప్రీతి సైని, తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగ భవనాలను విశ్రాంత గదులుగా మార్చాలి

ఉక్కుటౌన్‌షిప్, జూలై 28: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు సమీపంలో నిరుపయోగంగా ఉన్న మార్కెట్ భవనాలను విశ్రాంత గదులుగా మార్చి డ్రైవర్లకు ఇవ్వాలని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి జి.గణపతిరెడ్డి ఉక్కు యాజమాన్యాన్ని కోరారు. ఉక్కు ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు చాలా ప్రాంతాల నుంచి వచ్చే లారీ డ్రైవర్లు వసతి సదుపాయం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అందువల్ల ఉక్కు యాజమాన్యం ఆలోచించి డ్రైవర్ల కోసం విశ్రాంత గదులను కేటాయించాలని కోరారు.

పదో తరగతి బాలిక ఆత్మహత్య

గోపాలపట్నం, జూలై 28: పదో తరగతి చదువుతున్న బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఎల్లపువానిపాలెంలో చోటుచేసుకుంది. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎన్ఏడీ కూడలిలోని ఓ హోటల్‌లో పని చేస్తున్న ఓ మహిళ తమ చిన్న కుమార్తెతో కలిసి ఎల్లపువాని పాలెంలో నివసిస్తుంది. ఆదివారం ఉదయం ఆమె పనికి వెళ్లగా, పాఠశాలకు సెలవు కావడంతో కుమార్తె ఇంటి వద్దే ఉంది. అయితే బాలిక అక్క, బావ ఉదయం ఇంటికి వచ్చి మధ్యాహ్నం 12 గంటల సమయంలో బయటకు వెళ్లారు. అనంతరం వారు మూడు గంటలకు ఇంటికి వచ్చి ఎంతసేపు తలుపు కొట్టినా తెరవలేదు. దీంతో చుట్టుపక్కల వారి సాయంతో బలవంతంగా తలుపు తెరిచి చూడగా బాలిక గదిలోని ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఉండడాన్ని గుర్తించి కిందకు దించారు. అయితే అప్పటికే బాలిక మృతి చెంది ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐలు అప్పలనాయుడు, రామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాలిక మృతిపై తమకు ఎటువంటి అను మానాలు లేవని కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో ఆమె మృతికి గల కారణాలు తెలియరాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీపీఐ సర్వసభ్య సమావేశాన్ని సక్సెస్ చేయాలి

పెదగంట్యాడ, జూలై 28: నగరంలోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో ఆగస్టు రెండో తేదీన జరగనున్న సీపీఐ సర్వసభ్య సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ గాజువాక కార్యదర్శి కె.సత్యనారాయణ కోరారు. సీపీఐ గంగవరం శాఖ ఆధ్వర్యంలో ఆదివారం గంగవరం కాలనీలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో జరగనున్న సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హాజరవుతారన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు కె.నందన్న, పి.పోలయ్య, కె.పోతన్న, కె.మాధవరావు, సోమేశ్, ఎరిపిల్లి పెంటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి టోల్‌గేటును శాశ్వతంగా ఎత్తివేయాలి

అగనంపూడి, జూలై 28: అగనంపూడి టోల్‌గేటును శాశ్వతంగా ఎత్తివేయాలని కోరుతూ 78వ వార్డు సీపీఎం కార్పొరేటర్ గంగారావు ఆధ్వర్యంలో ఆదివారం స్థానికంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగనంపూడిలో మళ్లీ టోల్‌గేటు ఏర్పాటుకు ఎన్‌హెచ్ఏఐ అధికారులు టెండర్లను ఆహ్వానించడం సిగ్గుచేటన్నారు. తక్షణమే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీనివాసరాజు, ఉరిటి మరిడయ్య, పెదిరెడ్ల నీలకంఠం, తదితరులు పాల్గొన్నారు.

ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షునికి అభినందనలు

గాజువాక, జూలై 28: తెలుగు ఫిల్మ్ ఛాంబర్ నూతన అధ్యక్షునిగా భరత్ భూషణ్ ఎన్నికవ్వడం పట్ల స్టేట్ వైడ్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ కన్వీనర్ నల్లూరు సూర్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. డిస్ట్రిబ్యూటర్ రంగానికి చెందిన భరత్ భూషణ్‌ను ఫిల్మ్ ఛాంబర్ అధ్యకునిగా ఎన్నుకోవడం అభినందనీయమని, తద్వారా ఫిల్మ్ ఛాంబర్ మరింత అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. భరత్ భూషణ్ చేసిన కృషే ఆయన ఎన్నికవ్వడానికి కారణమని పేర్కొన్నారు.



సుజాతనగర్‌లో సభ్యత్వ నమోదులో పాల్గొన్న పంచకర్ల రమేశ్‌బాబు

జనసేన సభ్యత్వంతో రూ.5 లక్షల బీమా

ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, జూలై 28: జనసేన సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలకు ఐదు లక్షల రూపాయల బీమా సౌకర్యం కల్పిస్తున్నట్టు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. పెందుర్తి, సుజాతనగర్, పురుషోత్తపురంలలో ఆదివారం జనసేన నాయకులు డీబీఎల్ నాయుడు, కంచిపాటి మధు, పిల్లా జగన్మోహన పాత్రుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ సభ్యత్వ నమోదు శిబిరాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పంచకర్ల చేతుల మీదుగా పలువురు కార్యకర్తలు సభ్యత్వం స్వీకరించారు. పార్టీ సభ్యత్వాన్ని కార్యకర్తలంతా గౌరవంగా భావించాలన్నారు. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా జనసైనికులు పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని పంచకర్ల రమేశ్‌బాబు కోరారు. కార్యక్రమంలో నాయకులు కర్రి శివ, బలగ వైంకురరావు, సతీశ్, మణి, పలువురు వీర మహిళలు, జనసైనికులు పాల్గొన్నారు.

దసపల్లా రాణి కమలాదేవి అస్తమయం



రాణి కమలాదేవి

విశాఖపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : దసపల్లా సంస్థానం రాణి కమలాదేవి శనివారం దసపల్లా హోటల్‌లోని బంగ్లాలో అస్తమించారు. ఆమె వయస్సు 94 సంవత్సరాలు. చెముడు ఎస్టేట్ రాజు వైరిచర్ల నారాయణ గజపతి పెద్ద కుమార్తె ఆమె. ఒడిశాలోని దసపల్లా సంస్థానాధిపతి రాజా పూర్ణచంద్రదేవ్ భంజ్‌ను వివాహం చేసుకున్నారు. నగరంతో సుదీర్ఘ అనుభవం ఉన్న ఆమెకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. శనివారం సాయంత్రం ఆమె పార్థివదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

'ఉక్కు'ను కూటమి ప్రభుత్వం కాపాడాలి

పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ



దీక్షా శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు, కార్మికులు

కూర్మన్నపాలెం, జూలై 28: స్టీల్‌ప్లాంటును కాపాడి ఉక్కు ఉద్యోగులు, నిర్వాసితుల నమ్మకాన్ని కూటమి ప్రభుత్వం నిలబెట్టాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1,263వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయిస్తే పురోభివృద్ధి సాధిస్తుందన్నారు. గత ఏడు నెలలుగా సకాలంలో ఉద్యోగులు, కార్మికులకు జీతాలివ్వలేని స్థితికి కర్మాగారం చేరుకోవడం శోచనీయమన్నారు. నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారంలో ఉత్పత్తికి సరిపడా ముడిసరకు లేదన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు స్టీల్‌ప్లాంట్ సాధారణ ఉత్పత్తి దిశగా నడిచేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు జి.గణపతిరెడ్డి, పరంధామయ్య, రమణా రెడ్డి, దాసు, గోవింద్, చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ల నుంచి వృథాగా పోతున్న నీరు

అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజల ఆవేదన



జోనల్ కార్యాలయం సమీపంలో వృథాగా పోతున్న తాగునీరు

గాజువాక, జూలై 28: జీవీఎంసీ గాజువాక జోన్ పరిధిలోని ప్రతి వార్డులో తాగునీరు వృథాగా పోతున్నా సంబంధిత విభాగం అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ క్రమంలో గాజువాక వందడుగుల రోడ్డులో.. అదికూడా జోనల్ కార్యాలయానికి సమీపంలోనే గత కొంతకాలంగా ప్రధాన పైపులైన్ నుంచి తాగునీరు ఫౌంటెయిన్ మాదిరిగా వృథాగా పోతోంది. జోనల్ కార్యాలయానికి ఇదే మార్గం గుండా అధికారులు రాకపోకలు సాగిస్తున్నా తాగునీటి వృథాపై ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం దారుణమని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వార్డుల్లో నీటి వృథాపై తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

'ఎస్ఎంఎస్' కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఉక్కుటౌన్‌షిప్, జూలై 28: స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్ విభాగంలో విధుల నిర్వహిస్తున్న కార్మికుల ప్రధాన సమస్యలు పరిష్కరించాలని కార్మిక నాయకులు పీవీ రమణమూర్తి, బి.అప్పారావు అధికారులను కోరారు. ఆదివారం టౌన్‌షిప్‌లో జరిగిన కార్మికుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్లాంట్‌కు కీలక విభాగమైన ఈ విభాగంలో కార్మికులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలన్నారు. ఎస్ఎంఎస్‌లో కార్మికుల సంఖ్యను పెంచేందుకు యాజమాన్యం తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

కొనుగోళ్ల సమయంలో అప్రమత్తంగా ఉండాలి

ఆటోనగర్, జూలై 28: వస్తువుల కొనుగోళ్ల సమయంలో జరిగే మోసాల పట్ల వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని టీఎస్సార్‌టీబీకే కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధనరావు అన్నారు. శ్రీనగర్‌లోని కళాశాలలో ఆదివారం జరిగిన వినియోగదారుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ వినియోగదారులందరూ తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకుని చైతన్యవంతులయ్యేందుకు ఇటువంటి సదస్సులు దోహదపడతాయన్నారు. లీగల్ మెట్రాలజీ విభాగం డిప్యూటీ కంట్రోలర్ రాధాకృష్ణ తూనికలు, కొలతల్లో జరిగే అవకతవకలను వివరించారు. కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి ప్రసాద్ వినియోగదారుల రక్షణ చట్టాలు, తగవుల పరిష్కారానికి తమ యంత్రాంగం చేస్తున్న కృషిని తెలియజేశారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు శరత్‌చంద్ర, సుకన్య ప్రియ, రేజా, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

'లయన్స్' ఆధ్వర్యంలో నిరంతరం మొక్కలు నాటుతాం

కూర్మన్నపాలెం, జూలై 28: కాలుష్య నివారణకు మొక్కలు నాటే ప్రక్రియను నిరంతరం కొనసాగిస్తామని లయన్స్ క్లబ్ కూర్మన్నపాలెం శాఖ అధ్యక్షుడు అమిరెడ్డి మురళీధరరెడ్డి అన్నారు. 87వ వార్డు రాజులపాలెంలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇప్పటికే రక్తదాన శిబిరాలు, విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ, అనాథ ఆశ్రమాలకు చేయూతనందించడం తదితర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్పొరేటర్ బొండా జగన్ మాట్లాడుతూ వడ్లపూడి, లక్ష్మీపురం, రాజులపాలెం, త్రిశక్తి ఆలయం, కణితి కాలనీల్లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉద్యమంలా మొక్కలు నాటడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు కేవీ సుబ్బరాజు, ఎ.సూర్యనారాయణ, శ్రీనివాసరావు, లక్ష్మారెడ్డి, కేవీ ప్రసాద్, శంకరరావు, రవికుమార్, రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ మారువారం పండగ

వేపగుంట, జూలై 28: వేపగుంట శివారుప్రాంతమైన వరలక్ష్మీనగర్‌లో మరిడిమాంబ మారువారం పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు అర్చనలు చేశారు. మధ్యాహ్నం చేపట్టిన అన్న సమారాధనలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు.

ఎమ్మెల్యేకి 50వ వార్డులో సమస్యలపై వినతి


ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకి వినతిపత్రమిస్తున్న వరప్రసాద్

మాధవధార, జూలై 28; గ్రేటర్ 50వవార్డు మాధవధారలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలపై ఆదివారం ఆ వార్డు అధ్యక్షుడు సనపల.వరప్రసాద్ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజుకి వినతి పత్రంఅందించారు. ప్రధానంగా వార్డులోని 22ఏలో ఉన్న నిషేధిత భూములను ఆ జాబితా నుంచి తొలగించాలని విన్నవించారు. మాధవధారలో రైతుబజార్ ఏర్పాటు, పార్కుల అభివృద్ధి అంశాల్ని పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వరప్రసాద్ తెలిపారు.

చిన్నారులకు క్రీడా పోటీలు

డాబాగార్డెన్స్, జూలై 28: బాల్య దశలో క్రీడల్లో పాల్గొంటే.. వారు ఎంతో ఆనందంగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందని పలువురు అతిథులు పేర్కొన్నారు. ఆదివారం జీవీఎంసీ చిల్డ్రన్స్ ఎరీనాలో పేజ్-3 ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో న్యూ ఇండియా ఒలింపిక్ జేబీ గేమ్స్ 2024 ఆటల పోటీలను నిర్వహించారు. ఐదు నెలల నుంచి 54 నెలల వయస్సు నిండిన చిన్నారులు బుడిబుడిఅడుగులతో ఆటల్లో పాల్గొన్నారు. రన్నింగ్, విలువిద్య, సైకిలింగ్, నడక తదితర అంశాల్లో పాల్గొని సత్తాచాటారు. ఈ సందర్భంగా అతిథులుగా హాజరైన ఎన్‌బీటీజీ వ్యవస్థాపకుడు దుర్గాప్రసాద్, వీఓ వ్యవస్థాపకులు శివ, ప్రీతమ్, సంస్కృతి పాఠశాల డైరెక్టర్స్, వాలంటీర్స్ పి.నిరుపమ, ధనలక్ష్మి హాజరై మాట్లాడుతూ బాల్య దశనుంచి చిన్నారులను క్రీడల్లో ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. విజేతలకు సర్టిఫికెట్స్, మెడల్స్ ప్రదానం చేశారు.

1న చంద్రబాబు పాలన పురోగతిపై సదస్సు

డాబాగార్డెన్స్, జూలై 28: చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై 50 రోజులు పూర్తవుతున్న సందర్భంగా తెలుగుశక్తి ఆధ్వర్యంలో ఆగస్టు 1న రాష్ట్ర పురోగతిపై సదస్సును నిర్వహించనున్నట్లు తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ అన్నారు. ఆదివారం సదస్సుకు సంబంధించి పోస్టర్‌ను దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆవిష్కరించారన్నారు. సదస్సులోఅన్ని రంగాల ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు.ఈకార్యక్రమంలోవసంతరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ మ్యూజిక్ అకాడమీ నూతన కార్యవర్గం ఎంపిక

డాబాగార్డెన్స్, జూలై 28: విశాఖ మ్యూజిక్ అకాడమీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం డాబాగార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో అకాడమీ 52వ వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంగీత ప్రపంచానికిసేవలందించి పదవీ విరమణ చేస్తున్న విభాగ అధ్యక్షులు డాక్టర్ ఎస్వీ రంగరాజన్, కార్యదర్శిగా అనన్య ఎం.ఎస్.శ్రీనివాస్ సేవలను అకాడమీ బృందం ఈసందర్భంగా కొనియాడారు. దక్షిణ భారతదేశ కళాకారులు, సంగీతప్రియులకు అకాడమీ ద్వారా వారు చేసిన సేవలనుప్రశంసించారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా కేవీ రామ్మూర్తి, కార్యదర్శిగా వీరఘంట చంద్రశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా బీఏ రాజారావు, డా.పేరాల బాలమురళీకృష్ణ, కోశాధికారిగా సీహెచ్ దుర్గాప్రసాద్, సహాయకార్యదర్శులుగా భుజంగరావు,జ్వాలాప్రసాద్ ఎన్నికయ్యారు.

ముగ్గురు విద్యార్థులను కాపాడిన లైఫ్‌గార్డులు

సాగర్‌నగర్, జూలై 28 : రుషికొండ తీరంలో సముద్ర స్నానాలు చేస్తూ ప్రమాదానికి గురైన ముగ్గురు ఇంజనీరింగ్ విద్యార్థులను లైఫ్‌గార్డులు రక్షించారు. ఆదివారం మల్కాపురం ప్రాంతానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులు ఈశ్వరరావు, భరత్, రవి రుషికొండ బీచ్‌కు విహారానికి వచ్చారు. వారు సముద్రంలో స్నానం చేస్తుండగా ఒక్క సారిగా పెద్ద కెరటం తాకడంతో చెల్లాచెదురయ్యారు. ప్రమాదాన్ని గమనించిన లైఫ్‌గార్డులు వారిని రక్షించి, సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ఈశ్వరరావు సముద్రం నీళ్లు తాగేయడంతో గీతం ఆసుపత్రికి తరలించారు. ఆరిలోవ ఎస్ఐ రామదాసు సంఘటనా స్థలానికి చేరుకుని, విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

కృషి, పట్టుదలతో విజయం తథ్యం

▸▸ పార్వతీపురం జిల్లా కలెక్టర్ ఆడారి శ్యాంప్రసాద్


బహుమతులు అందిస్తున్న అతిథులు

అక్కయ్యపాలెం, జూలై 28: విద్యార్థి దశ నుంచే నిరంతర కృషి, పట్టుదలతో ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగితే విజయం తప్పకుండా వరిస్తుందని పార్వతీపురం జిల్లా కలెక్టర్ ఆడారి శ్యాంప్రసాద్ అన్నారు. కేంద్ర గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోర్టు కళావాణి ఆడిటోరియంలో గవర సామాజిక వర్గంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం, అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తాను లక్ష్యం దిశగా కృషి చేసి ఉన్నతస్థాయికి ఎదిగానన్నారు. ఐఏఎస్ చదవాలనుకునే వారికి అవసరమైన పుస్తకాలు అందిస్తానని హామీ ఇచ్చారు. పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పి.గణబాబు మాట్లాడుతూ ప్రపంచంలోని శాసించే రంగాల్లో నిష్ణాతులైన వారు గవర జాతీయులు ఉండడం గర్వకారణమన్నారు.గౌరీ సేవా సంఘం చేస్తున్న అభినందనీయమన్నారు. అనంతరం ఉత్తమ విద్యార్థులకు నగదు బహుమతులు, షీల్డ్‌లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్య నిపుణుడు మళ్ల భాస్కర్, సంఘం అధ్యక్షుడు బుద్ధ శివాజీ, జడ్పీ వైస్‌చైర్‌పర్సన్ భీశెట్టి సత్యవతి, బొడ్డేటి కాశీవిశ్వనాథం, మళ్ళ రామునాయుడు, ఆడారి లచ్చ అప్పారావు, మొల్లేటి వీర కుమారస్వామి, వేగి సత్యనారాయణపాల్గొన్నారు.

రావిశాస్త్రి రచనలు సమాజ దర్పణం

▸▸ జయంతి ఉత్సవంలో సాహితీవేత్తలు


రావి శాస్త్రికి చిటానికి నివాళులర్పిస్తున్న సాహితీ వేత్తలు

సీతంపేట, జూలై 28: రాచకొండ విశ్వనాథ శాస్త్రి (రావిశాస్త్రి) ప్రపంచ స్థాయికి తగిన రచయిత అని సాహితీ వేత్తలు కొనియాడారు. ఆయన అణగారినవర్గాల జీవితాలపై ఉత్తరాంధ్ర మాండలికంలో అద్భుతంగా రచనలు సాగించారన్నారు. ఆదివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో రచయిత కూనపరాజు కుమార్ అధ్యక్షతన రావిశాస్త్రి 102వ జయంతి సభను ఘనంగా నిర్వహించారు. రావిశాస్త్రి పేరిట పురస్కారాలను యువ రచయితలు మల్లిపురం జగదీష్, ఊహ, సురేంద్ర శీలంకు అందచేశారు. ముందుగా రావిశాస్త్రి చిత్రపటానికి వందన సమర్పణ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యవక్తగా విచ్చేసిన సీనియర్ న్యాయవాది వృద్ధుల కళ్యాణ రామారావు తాను రావిశాస్త్రి వద్ద జూనియర్‌గా పనిచేయటానికి వెళ్తే.. ఆయన తనను తాతా సూర్యనారాయణ వద్ద చేర్పించారన్నారు. తన వద్ద నేర్చుకోకూడని విషయాలు కూడాఉన్నాయని అందుకే సూర్యనారాయణ వద్ద చేర్పించినట్టు రావిశాస్త్రి తెలిపారన్నారు. ఆయన కథల్లో జరీ అంచు తెల్లచీర, మాయ గొప్ప విలువలతో కూడినవని వివరించారు. కోర్టు విషయాలపై అవగాహన ఉన్న వారికి శాస్త్రి కథలు బాగా అర్థమవుతాయన్నారు. ఆఖరి దశ, మోక్షం లాంటి గొప్ప కథలు సృష్టించిన మహా రచయిత అని పేర్కొన్నారు. సాహితీ వేత్త జీఎస్ చలం మాట్లాడుతూ రావిశాస్త్రి సాహిత్య సముద్రమని తెలిపారు. రావిశాస్త్రి కుమారుడు ఉమాకుమార శాస్త్రి మాట్లాడుతూ తన తండ్రి చివరి దశలో తాను చాలా హాయిగా ఉన్నానని, జీవితంలో ఎవరి కష్టాన్ని మూటగట్టుకుని పోవట్లేదని సంతృప్తి వ్యక్తంచేశారన్నారు. ఈ కార్యక్రమంలో రచయితలు, ప్రముఖ సాహితీ వేత్తలు వాడ్రేవు చినవీరభద్రుడు, కెఎస్ మల్లీశ్వరి, జగదీష్, తాడి ప్రకాష్, హైకోర్టు అడ్వకేట్ వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరమెట్ట భూసమస్యకు త్వరలో పరిష్కారం


పల్లా శ్రీనివాసరావుకు వినతి పత్రమిస్తున్న విల్లూరి దంపతులు

అల్లిపురం, జూలై 28: గ్రేటర్ 33వార్డు వెంకటేశ్వరమెట్ట దేవాలయ భూముల సమస్యను కూటమి ప్రభుత్వం త్వరలోనే పరిష్కరించనున్నట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపినట్లుఆ పార్టీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు విల్లూరి డాక్టర్ చక్రవర్తి చెప్పారు. ఆదివారం నగరంలోని పల్లా శ్రీనివాసరావును ఆయన నివాసంలో మర్యాదపూర్వంగా విల్లూరి దంపతులు కలిసి వినతి పత్రం అందజేశారు. భూ సమస్య ప్రభుత్వంతో ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడారని, త్వరలో చర్చించిన తరువాత పరిష్కారిస్తామని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో విల్లూరి తిరుమలదేవి పాల్గొన్నారు.

చిన్నోడికి ప్రేమతో పుస్తకావిష్కరణ

డాబాగార్డెన్స్, జూలై 28: తల్లిదండ్రులు ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకం చిన్నోడికి ప్రేమతోనని ద్రవిడ యూనివర్సిటీ మాజీ వీసీ కె.ఎస్.చలం అన్నారు. ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో విద్యావంతుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం చిన్నోడికి ప్రేమ పుస్తకం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యంలో ప్రతి బిడ్డకి ఇటువంటి అనుభవం అవసరమన్నారు. పుస్తక రచయిత డా.విజయలక్ష్మి దూరంగా ఉన్న తన బిడ్డకు తను రాసిన ఉత్తరాలన్నీ బహుమతిగా ఇచ్చిన అంశాలతో ఈ పుస్తకం ప్రచురించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ వ్యవస్థాపకురాలు డా.కె.రమాప్రభ అధ్యక్షత వహించగా ఎస్.ఎస్.ఆర్.జగన్నాథరావు, పి.మురళీకృష్ణ, ఈదర రవికిరణ్, సుధ, శ్రీనాథ్, డా.జోస్, శ్రీనివాస్, నళిని, ప్రకాశరావు, రవికిరణ్, చంద్రశేఖర్, సునీల్‌రెడ్డి, పద్మ, కన్నయ్య, పాల్గొన్నారు.

'అధిక ఫీజు వసూళ్లు చేస్తున్న ప్రైవేట్ ఆసుపత్రుల గుర్తింపు రద్దు చేయాలి'

అల్లిపురం, జూలై 28: జిల్లా వ్యాప్తంగా ప్రజలనుంచి అధిక మొత్తంలో ఫీజు వసూలు చేస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులు, మెడికల్ ల్యాబ్‌ల లైసెన్సులను రద్దు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె. అచ్యుతరావు, వై. రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం అల్లిపురం నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో జరిగిన అఖిల భారత యువజన సమాఖ్య ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రైవేట్ ఆసుపత్రులు, ల్యాబ్‌లు నిర్ణిత ఫీజులు వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు అశోక్, నాగరాజు, ఈశ్వర్,సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

బుద్ధుని విగ్రహం ఏర్పాటుకు విరాళం

అక్కయ్యపాలెం, జూలై 28 : గ్రేటర్ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలో ని కేఎన్ఎం ఉన్నత పాఠశాల ఆవరణలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుద్ధుడి విగ్రహం ఏర్పాటుకు ఆదివారం టీడీపీ విశాఖ పార్లమెంటరీ ఆర్గనైజింగ్ కార్యదర్శి అకిరెడ్డి జగదీష్ రూ.1.25 లక్షలు అం దించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు ప్రధాన కార్యదర్శి ముక్కి రామకృష్ణ, బీజేపీ అధ్య క్షుడు గురుగోవింద్ సింగ్, నాయకులు ఎంఎల్ఎన్ రావు, తోట శ్రీదేవి, శ్రీకృష్ణ, జనపాల కృష్ణ, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీమద్రామాయణ కల్పవృక్షంపై వ్యాససంపుటి ఆవిష్కరణ


వ్యాస సంపుటిని ఆవిష్కరిస్తున్న ప్రముఖ ప్రవచన కర్త గరికిపాటి నరసింహారావు

సీతంపేట, జూలై 28: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో శ్రీమద్రామాయణ కల్పవృక్షం ..ఉదాత్త కల్పనలు వ్యాస సంపుటి ఆవిష్కరణ సభను నిర్వహించారు. విశాఖ రసజ్ఞవేదిక వ్యవస్థాపకులు డాక్టర్ గండికోట రఘురామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రచయిత, ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త గరికిపాటి నరసింహారావు, ఆజో-విభో, కందాళం ఫౌండేషన్ ఆచార్య అప్పాజ్యోస్యుల సత్యనారాయణలు వ్యాస సంపుటిని ఆవిష్కరించారు. తొలి ప్రతిని విశ్వనాథ సత్యనారాయణకు సమర్పించారు. వ్యాస కర్తలు ఆచార్య బేతవలు రామసుబ్రహ్మం, డాక్టర్ అద్దంకి శ్రీనివాస్, డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, బులులు వెంకటేశ్వర్లు, డాక్టర్ కడిమిళ్ళ వరప్రసాద్, డాక్టర్ పేరి రవికుమార్‌లు స్పందన తెలిపారు. తరుగా ప్రచురణాలయం ప్రతనిధి తురగు కృష్ణకుమార్ వందన సమర్పణ చేశారు.సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన మిత్రబింద, సాన్విరాజ్

విశాఖపట్నం (స్పోర్ట్స్), జూలై 28: కేంద్రీయ విద్యాలయాల జాతీయ బాలికల బ్యా డ్మింటన్ చాంపియన్‌షిప్ టోర్నీకి నగరానికి చెం దిన మిత్ర బింద, సాన్విరాజ్ ఎంపికయ్యారు. ఇక్క డ జరిగిన రాష్ట్ర స్థాయి కేంద్రీ య విద్యాలయాల బాలికల అండర్-14 విభాగంలో సాన్విరాజ్, అండర్-17 విభాగంలో మిత్ర బింద పతకాలు సాధించి జాతీయ టోర్నీకి అర్హత సాధించారు. రైల్వే స్పోర్ట్స్ ఎన్‌క్లేవ్‌లోని బ్యాడ్మింటన్ అకాడమీలో కోచ్ ఉదయ్ భాస్కర్ వద్ద శిక్షణ పొందుతున్న ఈ చిన్నారులను రైల్వే స్పోర్ట్స్ ఆఫీసర్స్ ప్రవీణ్ భాటి, అవినాష్, ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాసరావు అభినందించారు. త్వరలో కేరళలో జరగనున్న జాతీయ టోర్నీలో కూడా పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

జీవో 117 రద్దు చేయాలి: డీటీఎఫ్

పూర్ణామార్కెట్, జూలై 28: పాఠశాల విద్యా వ్యవస్థకు అవరోధంగా మారిన జీవో 117ను తక్షణం రద్దుచేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) గౌరవ అధ్యక్షుడు జి.పైడపునాయుడు డిమాండ్ చేశారు. ఆది వారం క్వీన్‌మేరీ గర్ల్స్ హైస్కూల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం పాఠశాల రీ ఆర్గనైజేషన్ జీవో 84 తీసుకురావడంతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. 2022లో ఇచ్చిన జీవో 117తో 3,4,5, తరగతులను ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు తరలించడంతో అనేక పాఠశాలలుమూతపడే పరిస్థితి నెలకొందన్నారు. సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

31న కెమికల్ కళాశాలలో సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

కంచరపాలెం, జజూలై 28 : కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ కళాశాలలో పాలిసెట్ కౌన్సెలింగ్‌లో మిగిలిన సీట్లకు ఈనెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ పేర్కొన్నారు. కళాశాల్లో 16 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. కెమికల్ ఇంజినీరింగ్ బ్రాంచిలో 6, ప్లాస్టిక్ &పాలిమర్స్‌లో 5, ఆయిల్ టెక్నాలజీలో 5 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

కేన్సర్ సేవలను మరింత విస్తృతపరచాలి: కలెక్టర్


విశాఖపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి): కేన్సర్ సేవలను ప్రతి రోగికి అందించేలా వైద్యులు కృషి చేయాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సూచించారు. ఆంధ్ర మెడికల్ కళాశాల ఆడి టోరియంలో రెండో రోజు జరిగిన నేషనల్ కేన్సర్ గ్రిడ్ ఏపీ చాప్టర్ రెండో వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడారు. కేన్సర్‌ను ముందు జాగ్రత్తతో అరికట్టేందుకు అవకాశం ఉందని, ప్రజల్లో ఈమేరకు అవగాహన కల్పించాలన్నారు. నేషనల్ కేన్సర్ గ్రిడ్ ఏర్పాటుతో కేన్సర్ చికిత్సలో అధునాతన చికిత్సలు, అందుబాటులో ఉన్న వైద్య విధానాలపై చర్చించడం శుభపరిణామమన్నారు. ఈ సమావేశాలు నిరంతరం కొనసాగాలన్నారు. కేజీహెచ్‌లో హోమీ బాబా కేన్సర్ ఆస్పత్రి సహకారంతో నిర్వహిస్తున్న సేవలకు అవసరమైన సహకారాన్ని అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్ర మంలో హోమీ బాబా కేన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ ఉమేశ్ మహంత్ శెట్టి, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు, కేన్సర్ విభాగాధిపతి డాక్టర్ శిల్ప పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రజా వ్యతిరేకం'


జగదాంబ వద్ద నిరసన వ్యక్తంచేస్తున్న నాయకులు, కార్యకర్తలు

జగదాంబ కూడలి, జూలై 28: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతు, కార్మిక, గ్రామీణ పేదలకు వ్యతిరేకంగా ఉందని సీఐ టీయూ నేతలు విమర్శించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం బడ్జెట్‌కు వ్యతిరేకంగా ప్రతులు దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ విశాఖ జిల్లా కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ, బడ్జెట్‌లో గ్రామీణ ప్రాంత పేద వర్గాలకు పూర్తి అన్యాయం జరిగిందన్నారు. ప్రధాని మోదీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాల నిధుల్లో కోత విధించడం ఏమేరకు న్యాయమని ప్రశ్నించారు. ఇప్పటికే కేంద్రంపై ఇటీవల జరిగిన ఎన్నికల్లో పలు రాష్ట్రాల్లో ప్రజలు వ్యతిరేకత వ్యక్తమైన విషయం గుర్తుంచుకోవాలన్నారు. రైతు సంఘం జిల్లాకార్యదర్శి జి. నాయన బాబు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ రైతులకు ఎంత మాత్రం ఉపకరంగా లేదని విమర్శించారు. వ్యవసాయరంగాన్ని ఆదుకోనేలా బడ్జెట్‌లో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ శ్రేణులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి. కోటేశ్వరరావు, రాజు, విశాఖ జిల్లా నాయకులు ఎ. సీతాలక్ష్మి, పి. మణి, పి.వెంకటరెడ్డి, ఒమ్మి అప్పారావు, చంద్రమౌళి, నరేంద్రకుమార్, దేముడునాయుడు, భారతి కొండమ్మ, శంకరరావు, బాబురావు పాల్గొన్నారు.

పింఛన్‌దారుల సమస్యలపై దృష్టి


మాట్లాడుతున్న అకౌంట్స్ డైరెక్టర్ మోహనరావు

మహారాణిపేట, జూలై 28: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ పింఛదారుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తున్నట్టు రాష్ట్ర ట్రెజరరీ అకౌంట్స్ డైరెక్టర్ ఎం. మోహనరావు తెలిపారు. ఆదివారం ప్రభుత్వ పింఛన్‌దారుల సంఘం కార్యాలయంలో సమాచార శాఖ సిటిజన్స్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పింఛన్ దారులు సర్వీస్ పింఛన్, కుటుంబ పింఛన్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. సరైన రీతిలో ధ్రువ పత్రాలు ఉన్నట్లయితే, పింఛన్ వెంటనే మంజూరు చేస్తామన్నారు. అధికారులను నేరుగా సంప్రదించవచ్చని, ఎటువంటి వంటి మధ్యవర్తిత్వం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ త్యాగరాజు, సమాచార శాఖ ఆర్‌జేడీ ఆర్ వి. మణిరామ్, పి. వెంకటఅప్పారావు, పి. గోవిందరావు, డి . సాయిబాబా, డి రూన్సీ, రత్నబాయి తదితరులు పాల్గొన్నారు.

హెపటైటిస్‌పై అవగాహన అవసరం

మహారాణిపేట, జూలై 28: హెపటైటిస్ ఏ ప్రమాదకరమైన కాలేయ సంక్రమణ వ్యాధి అని, దీనిపై ప్రభుత్వం ప్రజల్లో అవగాహన పెంపొందించాలని ప్రముఖ పిల్లల వైద్యులు, వ్యాక్సిన్ నిపుణులు డాక్టర్ సీహెచ్ ఫణికృష్ణ అన్నారు. బీచ్‌రోడ్డులో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కలుషిత ఆహారం, నీటి వినియోగంతో వ్యాధివస్తుందన్నారు. పలువురు పాల్గొన్నారు.

మురళీనగర్‌లో వైద్య శిబిరం

మురళీనగర్, జూలై 28 ; మురళీనగర్ వాకర్స్‌క్లబ్‌లో ఆదివారం క్లబ్ అధ్యక్షుడు పల్లా.చంద్రమౌళి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విశ్వం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్య సిబ్బంది రోగులకు చికిత్సలు అందించారు. వైద్యులు ఎస్.సతీష్ సీజనల్ వ్యాధుల నివారణపై పలు సూచనలందించారు. క్లబ్ కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

కథలతో పిల్లల ఊహలకు దోహదం

సీతంపేట, జూలై 28: ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో గ్రంథాలయ సొసైటీ, భారతీయ విద్యాభవన్స్ పబ్లిక్ స్కూల్ సంయుక్తంగా వియావాకీ స్టోరీటెల్లింగ్ సెషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ వాసిస్ ఓవర్ ఆర్టిస్ట్, కథకురాలు సీతాశ్రీనివాస్ ఆకట్టుకునే రీతిలో చిన్నారులకు కథలు చెప్పి వివరించారు. పిల్లలు కథలతో కలల ప్రపంచంలోకి ప్రవేశిస్తారని ఆమె తెలిపారు.

ప్రతిభ గుర్తింపునకే ప్రోత్సాహకాలు

ది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ ఛైర్మన్ చలసాని


చెక్కులు అందజేస్తున్న చలసాని రాఘవేంద్రరావు

సీతమ్మధార, జూలై 28 : విద్యార్థులు సమాజంలో కీలక ప్రాత పోషించాలన్న ఆశయంతో ది విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ ఏటా తమ సభ్యులు, బ్యాంకు ఉద్యోగుల పిల్లలకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తుందని బ్యాంక్ ఛైర్మన్ చలసాని రాఘవేంద్రరావు అన్నారు. మద్దిలపాలెంలోని కాకతీయ ఫంక్షన్ హాలులో ఆదివారం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ఈఏడాది 479 మంది విద్యార్థులకు రూ. 29.75 లక్షల విలువైన నగదు బహుమతులు ప్రకటించినట్టు తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఎంసెట్, ఐఐటీ, నీట్ తదితర పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బాలాజీ ఎడ్యుకేషన్స్ ఇనిస్టిట్యూట్ ఛైర్మన్ మండప రవికుమార్, ఛైర్మన్ రాఘవేంద్రరావు చేతుల మీదుగా నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్లు సీఈఓ పీవీ నరసింహమూర్తి, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

ఎం.పి. భరత్ నేడు కార్యాలయంలో ఉండరు

ఎం.వి.పి.కాలనీ, జూలై 28: పార్లమెంటు సభ్యులు శ్రీభరత్ సోమవారం విశాఖలో అందుబాటులో ఉండరని ఆయన కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. కేంద్ర బడ్జెట్ సమావేశాల్లో పాల్గొనేందుకు ఢిల్లీలోనే వెళ్లినట్టు పేర్కొన్నారు. ఆయన జన్మదినం సందర్భంగా పార్టీ కార్యకర్తలు, అభిమానులు గమనించాలని పేర్కొంది.

దంతెవాడ వరకే కిరండోల్ రైలు

విశాఖపట్నం, జూలై 28: భద్రతా కారణాల దృష్ట్యా విశాఖ, కిరండోల్ మధ్య నడిచే ప్రత్యేక పాసింజర్ రైళ్ల గమ్యాలను కుదించినట్టు సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖ-కిరండోల్ రైలు ఈనెల 28 నుంచి 31 వరకు విశాఖ నుంచి దంతెవాడ వరకు, తిరుగు ప్రయాణంలో కిరండోల్ - విశాఖ రైలు ఈనెల 29 నుంచి ఆగస్టు ఒకటి వరకు దంతెవాడ నుంచి విశాఖకు నడుస్తుందన్నారు.

జీవీఎంసీలో టీడీఆర్ హడల్

... 5వ పేజీ తరువాయి

భూములు దశాబ్దాలుగా ప్రభుత్వానికి దఖలుపడినట్టు రెవెన్యూ రికార్డుల్లో ఉన్నాయి. వైసీపీ నేతలు వాటిపై కన్నేశారు. దసపల్లా రాణి కమలాదేవి వారసులకు హక్కులున్నాయని పేర్కొంటూ ఆ భూములను డెవలప్‌మెంట్‌పేరుతో చేజిక్కించుకున్నారు. ఆ భూమిలో నుంచి ప్రస్తుత 40 అడుగుల రోడ్డులోనే పెద్దగా వాహన రాకపోకలు లేనప్పటికీ, వంద అడుగులకు విస్తరించాలని జీవీఎంసీ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రోడ్డు నిర్మాణం కోసం ఆగమేఘాలపై టెండర్లు పిలిచారు. విస్తరణలో దసపల్లా భూముల్లో సేకరించాల్సి ఉందంటూ రూ.120 కోట్ల విలువైన టీడీఆర్ జారీకి అంచనాలు తయారుచేశారు. దసపల్లా భూమిలో బహుళ అంతస్తుల భవనాలు నిర్మించాలంటే వంద అడుగుల అప్రోచ్ రోడ్డు ఉండాలి. దీంతో జీవీఎంసీ నిధులతోనే విస్తరించడంతోపాటు విస్తరణకు భూమి ఇచ్చినందున టీడీఆర్ తీసుకుని, ఆ బాండ్లనే బిల్డింగ్ పర్మిషన్, డెవలప్‌మెంట్ ఫీజుల కింద జీవీఎంసీకి చెల్లించాలని వైసీపీ నేతలు ఎత్తులు వేశారు. దీనిపై టీడీపీ, జనసేన నేతలు పెద్దఎత్తున ఆందోళనకు దిగడంతోపాటు కోర్టుల్లో కేసులు వేయడంతో టీడీఆర్ జారీకి బ్రేక్‌పడింది. సీతమ్మధార బిలాల్ కాలనీలో మూడెకరాల భూమి ఆంధ్రా బ్యాంక్ హౌసింగ్ కో-ఆపరేటివ్ సొసైటీదని పేర్కొంటూ రూ.వెయ్యి కోట్ల టీడీఆర్‌కు వైసీపీ నేతలు స్కెచ్ వేశారు. వెంకటపతిరాజునగర్‌లో వంద కోట్ల టీడీఆర్ బాండ్లకు ప్రయత్నించినవిషయం 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తేవడంతో అధికారులు బాండ్లు నిలిపివేశారు. ఇవికాకుండా ఎంవీపీ సిటీ, ఎండాడ ప్రాంతాల్లో మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అక్రమంగా టీడీఆర్‌లు పొందారనే ఆరోపణలున్నాయి.

మంత్రి ఆదేశాలతో గుబులు

ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో వీటన్నింటినీ గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రస్తావించడంతో పురపాలకశాఖమంత్రి నారాయణ దీనిపై లోతైన విచారణకు ఆదేశించారు. అక్రమంగా టీడీఆర్ పొందినవారితోపాటు జారీచేసిన అందరు అధికారులపైనా చర్యలు తప్పవని స్పష్టంచేశారు. దీంతో సంబంధిత అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి. అప్పటి అధికారపార్టీ నేతల ఆదేశాల మేరకు పనిచేశామని, వాటిని తిరగదోడితే ఇబ్బందులు తప్పవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మ్యాట్రిమోనీ ఫ్రాడ్స్


... 5వ పేజీ తరువాయి

మైకేల్‌షాలినీ పరారీలో ఉండడంతో వారి కోసం గాలిస్తున్నారు. అలాగే ఎంవీపీ కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు కూడా ఇలాంటి అనుభవమే ఎదురైంది. హైదరాబాద్‌కు చెందిన బత్తిసాయిప్రియఅతడ్ని మోసం చేసి రూ.22 లక్షలు కొట్టేసింది. సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదుచేయడంతో ఆమెను ఈనెల 26న అరెస్టు చేశారు.

నైజీరియా వాసుల చేతిలో...

నగరానికి చెందిన ఓ వైద్యురాలు తన భర్తతో విడిపోయారు. రెండో పెళ్లికి కోసం వెబ్‌సైట్‌లో తన ప్రొఫైల్ రిజిస్టర్ చేశారు. ఆమె నంబరుకు అమెరికా నుంచి అంటూ ఓ వ్యక్తి ఫోన్‌చేశాడు. తనకు భారతీయురాలిని పెళ్లి చేసుకోవాలనే కోరిక ఉందని, సంపన్న కుటుంబానికి చెందిన వాడినని నమ్మించాడు. ఇద్దరు యువతులతో సముద్రంలో బోటింగ్ చేస్తున్న వ్యక్తిని తన తండ్రిగా పేర్కొంటూ ఓ ఫొటో, స్టెప్ మదర్‌గా పేర్కొంటూ మరొకరి ఫొటోను వైద్యురాలి వాట్సాప్‌కు పంపించాడు. మంచి ఇంటీరియల్ డెకరేషన్‌తో వున్న గదిలోని సీలింగ్‌కి ఫొటో తీసి తన బెడ్‌రూమ్‌గా చూపించాడు. తన కుటుంబంలో వ్యక్తిగత స్వేచ్ఛ ఎక్కువని ఆమెను మరింతగా ఆకర్షించాడు. దీంతో ఆమె పెళ్లికి సిద్ధమయ్యారు. దీంతో రెండు రోజుల్లో ఇండియా వస్తున్నానంటూ విమానంటిక్కెట్లను ఆమెకు వాట్సాప్ చేశాడు. అమెరికన్ కరెన్సీతోపాటు విలువైన బహుమతులు తెస్తున్నానని నమ్మించాడు. అయితే రెండు రోజుల తర్వాత తనను ఎయిర్‌పోర్టులోఅధికారులు అడ్డగించారని, ఓ వ్యక్తితో కస్టమ్స్ అధికారిగా మాట్లాడించాడు. బహుమతులు తిరిగి అప్పగించాలంటే జరిమానా కట్టాలని చెప్పడంతో ఆమె సుమారు రూ.24.29 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేశారు. తర్వాత ఇంకా కావాలని కోరడంతో మోసపోయినట్టు గుర్తించి సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేయగా నిందితులు ఢిల్లీలో ఉంటు న్నట్టు తేలింది. దీంతో అక్కడ నైజీరియాకు చెందిన ఒసాస్ (38), అతనికి సహకరించిన మిస్లేయిర్‌ఖాన్ (27)లను అరెస్టు చేశారు.

అవగాహన తప్పనిసరి



సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇటీవల మాట్రిమోనీ ఫ్రాడ్స్ పెరుగుతున్నాయి. బాధితులంతా విద్యావంతులు, ఉద్యోగాల్లో ఉన్నవారే. పెళ్లి సంబంధం అందులో నూ అమెరికా సంబంధం అనేసరికి మరో ఆలోచన లేకుండా ట్రాన్స్‌లోకి వెళ్లిపోతున్నారు. వారు చెప్పింది గుడ్డిగా నమ్మేస్తున్నారు. మాట్రిమోనీఫ్రాడ్స్, స్టాక్‌మార్కెట్ ఫ్రాడ్స్ టాస్కగేమ్స్ పేరుతో ఎవరైనా ఫోన్‌చేసినా స్పందించకూడదు. అనుమా నం ఉంటే 9490617917 నంబరుకు సమాచారం ఇవ్వాలి. మోసానికి గురైనట్టు గుర్తిస్తే 1930 నంబరుకు ఫోన్‌చేయాలి. దీంతో డబ్బులు సైబర్ నేరగాళ్ల చేతిలో పడకుండా ఫ్రీజ్ చేయించే వీలుంటుంది.

- కె.భవానీప్రసాద్, సైబర్‌క్రైమ్ సీఐ

మూడోసారి!

... 5వ పేజీ తరువాయి

ప్రదక్షిణలు చేయడంతోనే కాలం గడిపేశారనే విమర్శలున్నాయి. దీంతో ఎనిమిదేళ్లయినా పనులు పూర్తికాలేదని, అదే ఇప్పుడు సంస్థకు భారంగా మారిందని కొందరు అధికారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మూడోసారి టెండర్లు పిలవాల్సి వచ్చిందని, కాంట్రాక్టు ఖరారై పనులు పూర్తిచేసేందుకు ఏడాది సమయం పడుతుందని చెబుతున్నారు. ఒకవేళ కాంట్రాక్టరు ఖరారుకాకపోతే ప్రస్తుతం ఉన్న రేట్ల మేరకు ప్రతిపాదనలు రూపొందించిన తరువాత మళ్లీ టెండర్లు పిలవాల్సి ఉంటుంది. అందుకు మరికొంత సమయం పడుతుందని భావిస్తున్నారు.

పీజీ ప్రవేశాలపై సందిగ్ధం..!

... 5వ పేజీ తరువాయి

వేలాదిమంది నిరుపేద విద్యార్థులు పీజీ చదవలేని పరిస్థితి ఏర్పడింది. ప్రైవేటు కాలేజీలు, యూనివర్సిటీల్లో భారీగా ఫీజులు చెల్లించాల్సి రావడంతో ఎక్కువమంది పీజీ కోర్సులకు దూరమయ్యారు. దీనిపై గతంలోనే చాలామంది మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ప్రస్తుతం ఉన్నత విద్యాశాఖను ప్రక్షాళన చేస్తున్నమంత్రిలోకేశ్.. దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోననే ఆసక్తి నెలకొంది.

దసపల్లా రాణి కమలాదేవి అస్తమయం



విశాఖపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : దసపల్లా సంస్థానం రాణి కమలాదేవి శనివారం దసపల్లా హోటల్‌లోని బంగ్లాలో అస్తమించారు. ఆమె వయస్సు 94 సంవత్సరాలు. చెముడు ఎస్టేట్ రాజు వైరిచర్ల నారాయణ గజపతి పెద్ద కుమార్తె ఆమె. ఒడిశాలోని దసపల్లా సంస్థానాధిపతి రాజా పూర్ణచంద్రదేవ్ భంజ్‌ను వివాహం చేసుకున్నారు. నగరంతో సుదీర్ఘ అనుభవం ఉన్న ఆమెకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. శనివారం సాయంత్రం ఆమె పార్థివదేహానికి అంత్యక్రియలు జరిగాయి.

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన

సింహాచలం,జూలై 28 :వరాహలక్ష్మీనరసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా ఆదివారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ పుష్పాలు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడా మండప ప్రదక్షిణ చేశారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ అన్ని నామాలకు ఒక్కొక్క స్వర్ణ పుష్పంతో పూజలు చేశారు. తరువాత అదే వేదికపై పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో ఆర్జిత నిత్య కల్యాణం ఘనంగా నిర్వహించారు. మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ఇసుకతోటలో అన్నదానం

వెంకోజీపాలెం, జూలై 28 : ఇసుకతోట జాతీయ రహదారి పక్కనున్న కనకదుర్గ అమ్మవారి వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అన్నదానం నిర్వహించారు. తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తొలుత అమ్మవారికి పూజలు చేసి, అనంతరం అన్నప్రసాద వితరణను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు సూరిశెట్టి వెంకటేశ్వరన్, కార్యవర్గ సభ్యులు కె.బాబు, కోరిబిల్లి శ్రీను, పెంటకోట రమేష్, అప్పలరాజు, ఎస్.బుజ్జి, పెంటకోట చిన్నాబాబు, 16వ వార్డు టీడీపీ అధ్యక్షుడు గోపి, ముగడ వాసు, ఉమారాణి, బాబు, మొల్లి శోభ పాల్గొన్నారు.

'పథకాల పేర్లు మార్పు హర్షణీయం'

ఎంవీపీ కాలనీ, జూలై 28 : ప్రభుత్వ సంక్షేమ పథకాలకు జగనన్న పేరు బదులు మహనీయుల పేర్లు పెట్టడం హర్షణీయమని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ ప్రణవ్ గోపాల్ అన్నారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సర్వేపల్లి రాధాకృష్ణ, డొక్కా సీతమ్మ, అబ్దుల్ కలాం వంటి మహనీయుల పేర్లను పథకాలకు పెట్టడం ద్వారా తమకు వైసీపీకి చాలా వ్యత్యాసం ఉందని కూటమి ప్రభుత్వం స్పష్టం చేసిందన్నారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి స్ఫూర్తిదాయకంగా పని చేస్తున్నారని ఆయన కొనియాడారు.

మహిళలకు వైద్య పరీక్షలు

వెంకోజీపాలెం, జూలై 28 : కొత్త వెంకోజీపాలెంలోని మెడికవర్ ఆసుపత్రిలో కార్పొరేట్ వర్కింగ్ ఉమెన్ల కోసం ప్రత్యేకంగా 'షీ క్లినిక్స్' ప్రారంభమైంది. విశాఖ పోర్టు అథారిటీలోని గోల్డెన్ జూబ్లీ ఆస్పత్రి సీఎంఓ డాక్టర్ ఎస్. ఉషాదేవి ఈ క్లినిక్స్‌ను ప్రారంభించారు. ఉద్యోగం చేసే మహిళలకు ప్రతి శనివారం 30 శాతం తగ్గింపుతో వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు పప్పు శాంతి, కిరణ్మయి, తనూజ ప్రియదర్శిని కోరారు.

ఏడాదిగా విద్యుత్ ఏఈ పోస్టు ఖాళీ

పద్మనాభం (రూరల్), జూలై 28 : పద్మనాభం విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ఏడాదిగా ఏఈ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తక్షణమే ఆ పోస్టును భర్తీ చేయాలని వినియోగదారులు. రైతులు కోరుతున్నారు. గతంలో ఇక్కడ ఏఈగా పనిచేసిన జగన్మోహన్‌రావు అనివార్య కారణాల వల్ల బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది. ఇన్‌చార్జిలను నియమించినా ప్రయోజనం లేకుండాపోతుంది. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఏఈ పోస్టును భర్తీ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

7,400 కిలోల టమాటా విక్రయం

ఎంవీపీ కాలనీ, జూలై 27 : ఎంవీపీ రైతుబజారులో ఆదివారం 7,400 కిలోల టమాటాలు విక్రయించారు. కొన్న ధరకే విక్రయం చేపట్టిన ప్రభుత్వం అన్ని రైతుబజార్లలోనూ కిలో రూ.32లకే విక్రయించింది. దీంతో ప్రజలు భారీగా క్యూ కడుతున్నారు. ఒకరికి ఇన్ని కిలోలు మాత్రమే అన్న నిబంధనలేవీ లేకపోవడం, ఎలాంటి గుర్తింపు కార్డులు అడగకపోవడంతో చాలామంది కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నారు. బహిరంగ మార్కెట్లో కిలో రూ. 45 నుంచి రూ. 60 ఉండగా మాల్స్‌లో రూ. 85 వరకూ విక్రయిస్తున్నారు. .

సినిమా గైడ్

- **రాయన్ :** జగదాంబ, సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
- **పురుషోత్తముడు :** శ్రీకన్య, రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), తాతా (తగరపువలస)
- **ఆపరేషన్ రావణ్ :** రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
- **కల్కి :** మెలోడి, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), కన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 30, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 36, పచ్చిమిర్చి 48, కాకరకాయలు 42, బీరకాయలు 40, ఆనపకాయలు 14, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 30, క్యారెట్ 30, దొండకాయలు 30, బంగాళదుంపలు 37, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 72, అల్లం (పాతది) 150, బరబటి 34, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 46, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 78, పొటల్స్ 38, కీరదోస 28, కాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 82, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	85
ఫారం ధర	--	105
విత్ స్కిన్	--	180
స్కిన్‌లెస్	--	190

కాలేయ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

▸▸ కలెక్టర్ హరేంధిర ప్రసాద్



హెపటైటిస్ డే ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, జూలై 28 : కాలేయ సంబంధిత వ్యాధులపై ప్రజలకు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ హరేందిర ప్రసాద్ అన్నారు. ఆదివారం హెపటైటిస్ డే సందర్భంగా ఆంధ్ర మెడికల్ కాలేజీ, కేజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం బీచ్ రోడ్డులో కాళీమాత ఆలయం విక్టరీ ఎట్ సీ వరకు నిర్వహించిన హెపటైటిస్ అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ హెపటైటిస్ బి,సిలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే దీర్ఘకాలిక అనారోగ్య పరిస్థితులకు దారితీస్తాయని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా కొన్ని కోట్ల మంది కాలేయ సంబంధిత వ్యాధులతో మృతి చెందుతున్నారన్నారు. ప్రధానంగా పిల్లలకు పుట్టిన 24 గంటల్లో హైపటైటిస్ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. ఆరోగ్య కరమైన జీవన శైలిని పాటించాలన్నారు. సమావేశంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చి రాజు, గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం సీనియర్ వైద్యులు పెదవీర్రాజు, డాక్టర్ ఎల్ఆర్ఎస్ గిరినాథ్, కేజీహెచ్ హెచ్ఆర్ మేనేజర్ జవహర్‌రావు, వైద్యులు, పాల్గొన్నారు.

ఎండాడలో రైతు బజార్ : ఎమ్మెల్యే గంటా


గంటాకు జ్ఞాపిక అందిస్తున్న గోల్డ్ కోస్ట్ అసోసియేషన్ సభ్యులు

ఎండాడ, జూలై 28 : అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజల జీవన ప్రమాణ స్థాయిని పెంచుతామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. 8వ వార్డు ఎండాడలోని ఎంకే గోల్డ్ కోస్ట్‌లో ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్, మాజీ న్యాయమూర్తి ధర్మారావు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి గంటాను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఎండాడ ప్రాంత ప్రజల కోసం అధునాతన రైతు బజార్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అలాగే మురుగు నీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. అమరావతితో పాటు విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కట్టుబడి ఉన్నారన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేత, కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి 50 వేల కోట్ల కేటాయింపులు తీసుకురావడం కూటమి ప్రభుత్వం 50 రోజుల్లో సాధించిన ప్రగతిగా అభివర్ణించారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చకు రాకుండా ఢిల్లీలో ధర్నా చేయడం జగన్ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. తన విజయంలో అపార్ట్‌మెంట్ వాసుల కీలక పాత్ర పోషించారని తెలిపారు. అనంతరం అసోసియేషన్ ప్రతినిధులు గంటాను సన్మానించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నొడగల అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

31న ఎమ్మెల్యే గంటా విజయోత్సవ సభ

పద్మనాభం, జూలై 28 : పద్మనాభంలో ఈనెల 31న జరిగే భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విజయోత్సవ సభను నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు కె.రమణ కోరారు. ఆదివారం స్థానిక జెడ్పీ అతిథి గృహంలో నిర్వహించిన మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మండల ప్రజలు టీడీపీకి బ్రహ్మరథం పట్టారని, ఈనేపథ్యంలో వారికి కృతజ్ఞతలు చెప్పుకోవడంతో పాటు ఎమ్మెల్యేను సత్కరించడానికి ఈ సభ నిర్వహిస్తున్నామని చెప్పారు.ఈసభ ద్వారా వచ్చే అయిదేళ్లలో మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల జాబితాను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు తెలిపారు. సమావేశంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె. దామోదరరావు, మాజీ ఎంపీపీ లీలావతి, నాయకులు నగేష్‌కుమార్, నందీష్, ఆర్ఎస్ మూర్తి, శ్రీరామమూర్తి, ప్రసాద్, కృష్ణమూర్తిరాజు, మహేష్, గంగరాజు, ఎర్నాయుడు, సన్యాసిరావు, వెంకన్న, కృష్ణప్పడు పాల్గొన్నారు.

టెట్‌కు ఉచిత శిక్షణ

విశాఖపట్నం, జూలై 28 : టెట్‌కు హాజరయ్యే విద్యార్థులకు ప్రభుత్వ సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ఆ శాఖ అధికారి ఎం.సత్య పద్మ తెలిపారు.తెలుగు, ఉర్దూ మీడియంలో శిక్షణ ఉంటుందని ఆగస్టు 1 నుంచి సెప్టెంబరు 25 వరకు ఏయూ పీజీ సెంటర్‌లో శిక్షణ ఇస్తామని చెప్పారు.

విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు

ఆరిలోవ, జూలై 28 : నగరంలోని జూపార్కులో ఒకటి నుంచి పిజి వరకు చదువుతున్న విద్యార్థులకు ఆదివారం పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. సోమవారం అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ఈ పోటీలు నిర్వహించినట్టు జూ క్యూరేటర్ నందనీ సలారియా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పులులు అడవిలో ఏ విధంగా జీవనం సాగిస్తున్నాయి, ప్రస్తుతం అవి ఎటువంటి ప్రమాదంలో ఉన్నాయి, తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు.

పదో తరగతి బాలిక ఆత్మహత్య

గోపాలపట్నం, జూలై 28 : పదో తరగతి చదువుతున్న బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఎల్లపువానిపాలెంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎన్ఏడీ కూడలిలోని ఓ హోటల్‌లో పని చేస్తున్న ఓ మహిళ తమ చిన్న కుమార్తెతో కలిసి ఎల్లపువానిపాలెంలో నివసిస్తుంది. ఆదివారం ఉదయం ఆమె పనికి వెళ్లగా, పాఠశాలకు సెలవు కావడంతో కుమార్తె ఇంటి వద్దే ఉంది. అయితే బాలిక అక్క, బావ ఉదయం ఇంటికి వచ్చి మధ్యాహ్నం 12 గంటల సమయంలో బయటకు వెళ్లారు. అనంతరం వారు మూడు గంటలకు ఇంటికి వచ్చి ఎంత సేపు తలుపు కొట్టినా తెరవలేదు. దీంతో చుట్టుపక్కల వారి సాయంతో బలవంతంగా తలుపు తెరిచి చూడగా బాలిక గదిలోని ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఉండడాన్ని గుర్తించి కిందకు దించారు.అయితే అప్పటికే బాలిక మృతి చెంది ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐలు అప్పలనాయుడు, రామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాలిక మృతిపై తమకు ఎటువంటి అనుమానాలు లేవని కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో ఆమె మృతికి గల కారణాలు తెలియరాలేదు. గోపాలపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

విశాఖపట్నం, జూలై 28 : రామా టాకీస్ ఎదురుగా ఉన్న వాయుపుత్ర హెల్త్ క్లబ్‌లో ఆ క్లబ్ 30వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్ వైద్య సిబ్బంది 43 మంది దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా దాలిరాజు సూపర్ మార్కెట్ అధినేత కలివరపు దాలిరాజు మాట్లాడుతూ కరోనా తరువాత రక్తదాన శిబిరాలు తక్కువగా జరుగుతున్నాయని, ఈనేపథ్యంలో యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావడం శుభపరిణామన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా బాడీలిఫ్టింగ్ సంఘం అధ్యక్షుడు ఎస్ఎస్ శివశంకర్, లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్ వైద్యులు ప్రమోద్, అరుణ, యడ్ల లక్ష్మణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భీమిలి బీచ్‌కు సందర్శకుల తాకిడి

భీమునిపట్నం, జూలై 28 : భీమిలి బీచ్ సందర్శకులతో ఆదివారం కిటకిటలాడింది. వారం రోజులుగా కురిసిన వర్షాలు తెరిపివ్వడంతో నగరం నలుమూలలతో పాటు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి కూడా పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో సాగరకన్య విగ్రహం వద్ద, కొబ్బరితోట పార్క్, మంగమారిపేట, రామాద్రి బీచ్ రద్దీగా మారాయి.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ఆరిలోవ, జూలై 28 : సీజనల్‌తో పాటు కాలేయం సంబంధిత వ్యాధుల పట్ల ఖైదీలు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర కారాగారం వైద్యురాలు అరుణాదేవి సూచించారు. సోమవారం ఆమె జైలులో ఖైదీలకు ఆరోగ్య సూత్రాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జైలు సూప రింటెండెంట్ కిశోర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

పద్మనాభం, జూలై 28 : మండలంలోని పాండ్రంగి గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని ఆదివారం అరెస్టు చేసినట్టు ఎస్సై జె. సురేష్ చెప్పారు. గ్రామంలోని ఇటుక బట్టీల వద్ద పేకాట ఆడుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు సీఐ సీహెచ్ శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.12750/- నగదు, ఆరు సెల్‌ఫోన్లు, నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

జనసేన కార్యకర్తకు ఆర్థిక సాయం

మధురవాడ, జూలై 28 : జీవీఎంసీ ఏడో వార్డు మధురవాడ వాంబేకాలనీకి చెందిన జనసేన కార్యకర్త సాయిభాను ప్రకాశ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఈవిషయాన్ని భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జి సందీప్, వార్డు అధ్యక్షుడు నాగోతి నరసింహనాయుడు పార్టీ అధినేత పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఆదేశాల మేరకు బాధితుడికి వైద్య ఖర్చు కోసం రూ. 50 వేలు చెక్కును ఆదివారం సందీప్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది భీమిలి నియోజకవర్గంలో పది వేల మంది సభ్యత్వం తీసుకున్నారని, కష్టంలో ఉన్న కార్యకర్తలను పార్టీ ఆదుకుంటుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో బీవీ కృష్ణయ్య, శేఖర్, శ్రీనుబాబు, తదితరులు పాల్గొన్నారు.

98వ వార్డులో సభ్యత్వాల నమోదు


98వ వార్డులో సభ్యత్వ పత్రంతో కూడిన గిఫ్ట్‌ను అందజేస్తున్న మజ్జి సూరిబాబు

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డులో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వాల నమోదు చురుగ్గా సాగుతోంది. ఆపార్టీ వార్డు అధ్యక్షుడు మజ్జి సూరిబాబు సారధ్యంలో ఆదివారం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి సభ్యత్వాల నమోదు చేపట్టారు. ఒక్క రోజే 250 మంది సభ్యత్వాలు తీసుకున్నట్టు పార్టీ వార్డు ఉపాధ్యక్షుడు దాసరి మురళీ చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత మజ్జి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కళింగ సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి కృషి

కొమ్మాది, జూలై 28 : నగరంలో కళింగ సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర కార్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తున్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీపాన వెంకటరమణ తెలిపారు. ఆదివారం నగరంలో జరిగిన ఆ సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. మధురవాడ ప్రాంతంలో సుమారు వెయ్యి చదరపు గజాల స్థల సేకరణకు ప్రయత్నిస్తున్నామని, సభ్యులంతా ఐక్యతతో సంఘం బలోపేతానికి కృషి చేయాలని కోరారు. అనంతరం ఆయన సభ్యులకు గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ సమావేశంలో విశ్రాంత స్పెషల్ కలెక్టర్ సీపాన రామచంద్రరావు, విశాఖ ఫారెస్ట్ ఆఫీసర్ బిర్లంగి రామ్ నరేష్, విశ్రాంత వుడా చీఫ్ ఇంజనీరు మెట్ట అప్పన్న, ఏలూరు కళింగ అసోసియేష్ అధ్యక్షుడు దుప్పల లక్ష్మణమూర్తి, కోశాధికారి బొడ్డేపల్లి రామారావు, లీగల్ అడ్వయిజర్ నానుపాత్రుని సత్యనారాయణ, విజయనగరం ప్రతినిధులు బెండి చిరంజీవి, మొదలవలస రామారావు, డైరీ ఫారం కళింగ అసోసియేషన్ అధ్యక్షుడు నంబాల అప్పారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ లక్కినేని సంధ్య, నాయకులు బమ్మిడి రామారావు, బగాది లక్ష్మణరావు, బుడుమూరి చంద్రశేఖరరావు, మొజ్జాడ శ్రీనివాసరావు, పైడి చిన్నమ్మలు, తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థినికి రూ. లక్ష నగదు ప్రోత్సాహం

పెదవాల్తేరు, జూలై 28 : కృషి, పట్టుదల ఉంటే అనుకున్న లక్ష్యాన్ని సులభంగా సాధించవచ్చునని ఎమ్మెల్ రెడ్డి, కర్రి చంద్రశేఖర్ కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం పెదవాల్తేరు గ్రామ సేవా సంఘం కార్యాలయంలో ఆ సంఘం సభ్యులు ఎమ్మెల్ రెడ్డి, కర్రి చంద్రశేఖర్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థిని నీలిమకు రూ. లక్ష నగదు ప్రోత్సాహం అందజేశారు. కార్యక్రమంలో పెదవాల్తేరు గ్రామ పెద్దలు మద్ది అప్పలరెడ్డి, రత్నవల్లి, తనూజ, మాధవి, మద్దివారి పెద్దలు లక్ష్మణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై కిడ్నాప్ కేసు

ఎంవీపీ కాలనీ, జూలై 28 : ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి, బాలికను తీసుకుపోయిన ఘటనలో యువకుడిపై ఎంవీపీ పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేశారు. ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం.. పెదవాల్తేరుకు చెందిన బాలికను సుజాతనగర్‌లో టైల్స్ దుకాణంలో చేస్తున్న యువకుడు శోభనాపురపు యువరాజు (23) సోషల్ మీడియాలో పరిచయం చేసుకున్నాడు. ఆమె మాయమాటలు చెప్పి, తీసుకువెళ్లిపోయాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు.

విశాఖ భూ కుంభకోణంపై సిట్ నివేదిక బయట పెట్టండి

మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ

విశాఖపట్నం, జూలై 28 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో భూ కుంభకోణాలు, భూ కబ్జాలపై నిత్యం ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నందున గతంలో నియమించిన సిట్ నివేదికను బయటపెట్టాలని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. లాసన్స్‌బే కాలనీలోని వైసీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ జిల్లా పరిషత్‌కు శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో భూ కబ్జాలు, కుంభకోణాలపై అధికార, విపక్ష సభ్యులు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకున్నారన్నారు. మరికొందరు ప్రెస్‌మీట్‌లు పెట్టి భూ కబ్జాలు, దోపిడీలపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. దీనివల్ల రాజకీయపార్టీలపైనా, నాయకులపైన ప్రజల్లో భిన్నాభిప్రాయాలు ఏర్పడడంతోపాటు మరికొందరు నాయకులు తాము కూడా కబ్జా చేయాలనే ఆలోచన కలిగే ప్రమాదం ఉందన్నారు. ఇలాంటి వాటికి అడ్డుకట్టపడాలంటే టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో భూ కుంభకోణాలు, కబ్జాలపై 2017లో ఏర్పాటుచేసిన సిట్ నివేదికను బయటపెట్టాలని కోరారు. దీనివల్ల 2004 నుంచి భూ దోపిడీ, కబ్జాలకు పాల్పడిన దొంగలు ఎవరనేది బయటకు వస్తారన్నారు. ప్రజలకు కూడా ఎవరు ఎలాంటి వారనే దానిపై స్పష్టత వస్తుందన్నారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో తాను స్వయంగా సిట్ నివేదికను బయటపెట్టాలని రెండుసార్లు కోరినా, ప్రభుత్వంలోని పెద్దలు పట్టించుకోలేదన్నారు. ఈ ఏడాది మార్చిలో విశాఖ పోర్టుకు బ్రెజిల్ నుంచి రూ.25 లక్షల కోట్ల విలువైన మాదకద్రవ్యాలు నౌకలో దిగుమతి అయ్యాయనే ప్రచారం జరిగిందని, దీనిపై స్పష్టత కోసం ఉత్తరాంధ్ర ఎంపీలు పార్లమెంట్‌లో ప్రశ్న లేవనెత్తాలని సూచించారు. రాష్ట్రంలో ప్రతిపక్షహోదా కోసం సీఎం జగన్ కోర్టుని ఆశ్రయించడంపై విలేకరుల ప్రశ్నకు ఆయన స్పందిస్తూ చట్టంలో ఇవ్వాలని ఉంటే వస్తుందని, ఇవ్వకూడదని ఉంటే రాదు అని అన్నారు. ఉపాధ్యాయుల బదిలీలకు తాను డబ్బులు తీసుకున్నాననేది కేవలం ఆరోపణలు మాత్రమేనని కొట్టిపారేశారు.

కళలతోనే సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణ

సింహాచలం,జూలై 28 :కళలతోనే హైందవ సంస్కృతి సంప్రదాయల పరిరక్షణ సాధ్యమని జగద్గురు పీఠం డైరెక్టర్ చింతలపాటి సత్తిబాబు అన్నారు. విజయవాడకు చెందిన మువ్వగోపాల కల్చరల్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన కళాకారులు సింహాద్రినాథుడికి ఆదివారం తమ నృత్యాలతో నీరాజనాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి, రాజమహేంద్రవరం, చిత్తూరు, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు చెందిన అనేక మంది కళాకారులు పాల్గొని అభినయించిన నృత్యాలు ఆహూతులను మంత్రముగ్ధులను చేశాయన్నారు. అనంతరం సత్తిబాబును నిర్వాహకులు సత్కరించారు. అలాగే ప్రదర్శనలిచ్చిన కళాకారులకు ప్రసంశాపత్రాలు ఇచ్చారు.

అప్పన్న సన్నిధిలో వైస్ అడ్మిరల్ స్వామినాథన్



సింహాచలం, జూలై 28 : వరాహలక్ష్మీనరసింహస్వామిని నావికాదళ వైస్ అడ్మిరల్ కె. స్వామినాథన్ ఆదివారం దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి పూర్తి అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండప ప్రదక్షిణ చేసి, అంతరాలయం చేరుకున్న ఆయన గోత్రనామాలతో అర్చకులు స్వామివారికి అష్టోత్తర శతనామార్చన చేశారు. గోదాదేవి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

ఎండాడలో రన్నింగ్ పోటీలు

ఎండాడ, జూలై 28 : ఎండాడలోని ఐటీ రోడ్డులో స్థానిక అథ్లెటిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 2కే, 5కే, 10కే పరుగు పందాలు నిర్వహించారు. అనంతరం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డి. నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు కార్తీక్, 8వ వార్డు టీడీపీ అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి విజేతలకు బహుమతులు అందజేశారు. అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ పోటీలు నిర్వహించినట్టు సభ్యులు పి. రాజేష్, బలరామ్ తెలిపారు.

నేడు టీడీపీ భీమిలి సమావేశం

భీమునిపట్నం, జూలై 28 : బీచ్ రోడ్‌లో వున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు క్యాంపు కార్యాలయంలో సోమవారం తెలుగుదేశం పార్టీ మండల కార్యకర్తల సమావేశం జరగనున్నట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు దంతులూరి అప్పల నరసింహరాజు తెలిపారు. ఉదయం 10. 30 సమావేశం ప్రారంభమవుతుందన్నారు.మండలంలోని నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన కోరారు.

అమనాం ఊట చెరువు పరిసరాలు పరిశుభ్రం

భీమునిపట్నం (రూరల్), జూలై 28 : మండలంలోని అమనాం ఊట చెరువు పరిసరాలను ఆ గ్రామ టీడీపీ నాయకులు ఆదివారం శుభ్రం చేశారు. చెరువు వద్ద పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోవడంతో విపరీతమైన దుర్వాసన వస్తోంది. దీంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా ప్రయోజనం లేకపోవడంతో టీడీపీ నాయకులు ముందుకు వచ్చి జేసీబీతో చెరువు పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆదిరెడ్డి, నాయకులు డీఎస్ఎస్ రాజు, ఎం. రఘురామ్‌రెడ్డి, కె. శివ కుమార్, పోలయ్యరెడ్డి, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.